నమ్మలేని నిజాలు

కొబ్బరి చిప్ప
కళాఖండాలకుప్ప
ఉపాధి హామి

మాకంటి పాప
నాల్గు కళ్ల కాపలా
ఇంకెంత కాలం.

ట్రంప్ జలసంధి
ఆక్టోపస్ ఆక్రమణ
హార్మోజ్ గల్లంతు

దయ్యాల గోల
భూతవైద్యుల లీల
కాకురా బేల.

తూటాలు మాయం
దొరకని దొంగలు
సంస్థకు గాయం.

- రేడియమ్
సెల్: 9291527757



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com  ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433  E-mail:netinijam93@gmail.com

శ్రీనిజాలు

'ఇరవై రెండు ఎ' మాటున
బకాసురుల భూదందా !
కోట్ల విలువైన భూములు
గోవిందా! గోవిందా !
నిషేధాల పేరు తోటి
ఆస్తులన్ని భోజ్యం !
తలా తోక లేని మృగం
వికారాల రాజ్యం !

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245



హైదరాబాద్ గురువారం 17-9-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:40 పేజీలు:6 వెల: రూ.1/-


# సీఎం రేవంత్‌రెడ్డితో సింగపూర్ ప్రతినిధుల భేటీ

**తెలంగాణలో సెమీకండక్టర్ల పరిశ్రమ ఏర్పాటుకు సింగపూర్ ఆసక్తి**
**తెలంగాణతో భాగస్వామ్యానికి సిద్ధం!**



హైదరాబాద్, సెప్టెంబర్ 16:తెలంగాణలో సెమీకండక్టర్ల పరిశ్రమ ఏర్పాటుకు సింగపూర్ ఆసక్తి వ్యక్తం చేసింది. సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన ఇంధన వాణిజ్య విభాగం శాశ్వత కార్యదర్శి అగస్టిన్ లీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ అయింది. రాష్ట్రంలో పెట్టుబడులు, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతులు, భవిష్యత్ నగర నిర్మాణంపై ఇరువర్గాలు చర్చించాయి.

తెలంగాణలో సెమీకండక్టర్లు సహా అధునాతన సాంకేతిక రంగాల్లో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని ప్రభుత్వం చెబుతోంది. ఇప్పటికే రాష్ట్రం ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, ఏఐ వంటి రంగాలపై దృష్టి సారించింది.

సింగపూర్ ప్రతినిధులకు హైదరాబాద్ అభివృద్ధి ప్రణాళికలను సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. మూసీ పునరుజ్జీవనంలో భాగంగా తొలిదశలో మూసా, ఈసా నదుల సంగమం నుంచి గాంధీ సరోవర్ వరకు పనులు చేపట్టే ప్రణాళిక ఉందని తెలిపారు. మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధితో పాటు హైదరాబాద్‌లో నైట్ ఎకానమీని ప్రోత్సహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. హైదరాబాద్‌ను కేవలం పర్యాటక నగరంగా కాకుండా నాలెడ్జ్, టెక్నాలజీ, పరిశ్రమల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. మూసీ పునరుజ్జీవనం, నైట్ ఎకానమీ అభివృద్ధి అంశాలను సీఎం గతంలోనూ ప్రస్తావించారు.

భారత్ ఫ్యూచర్ సిటీని నెట్‌జీరో సిటీగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని సీఎం తెలిపారు. ఏఐ, డేటా సెంటర్లు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు, విద్య, ఆరోగ్యం, గ్రీన్ ఫార్మా వంటి రంగాలకు ఫ్యూచర్ సిటీలో అవకాశాలు కల్పిస్తున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే వెల్లడించింది. ఫ్యూచర్ సిటీని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసి ప్రపంచస్థాయి సంస్థలను ఆకర్షించడమే లక్ష్యమని సీఎం వివరించారు. 30 వేల ఎకరాల పరిధిలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది.

హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, ఎంఐటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వంటి అంతర్జాతీయ విద్యాసంస్థలు హైదరాబాద్‌లో తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌ల ఏర్పాటుకు అంగీకరించాయని సీఎం సమావేశంలో వివరించినట్లు ప్రభుత్వం తెలిపింది. హైదరాబాద్‌ను నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడంతో పాటు ప్రపంచస్థాయి సంస్థలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణలో పెట్టుబడులు పెట్టడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ఆర్థికంగా సహకరించాలని సీఎం సింగపూర్ ప్రతినిధులను కోరారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలపై సింగపూర్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించినట్లు సమావేశ వివరాల్లో పేర్కొన్నారు. డిసెంబరులో ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సింగపూర్ ప్రతినిధులను సీఎం ఆహ్వానించారు.

సింగపూర్‌తో తెలంగాణకు ఇప్పటికే పట్టణ ప్రణాళిక, నీటి నిర్వహణ, నైపుణ్యాభివృద్ధి, సెమీకండక్టర్లు, తయారీ, పర్యావరణం, సుస్థిరత వంటి రంగాల్లో సహకారంపై చర్చలు జరిగిన విషయం తెలిసిందే. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, దక్షిణాసియా సీనియర్ డైరెక్టర్ డాక్టర్ ఫ్రాన్సిస్ చోంగ్, కాన్సుల్ జనరల్ విలియం చిక్‌తో పాటు ఇతర సింగపూర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో భారీ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం

**49,025 మంది విద్యార్థులకు ఇక పోషకాహార అల్పాహారం**
**నాలుగు నియోజకవర్గాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రోజువారీ అల్పాహారం**
**అధునాతన సాంకేతికతతో కేంద్రీకృత వంటశాల**
**మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రారంభం**



కరీంనగర్, సెప్టెంబంర్ 16:ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించేందుకు కరీంనగర్‌లో భారీ స్థాయిలో నిర్మించిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రారంభించారు. కరీంనగర్ మార్కెట్ యార్డులో నిర్మించిన ఈ ఆధునిక వంటశాల ద్వారా నాలుగు నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతిరోజూ అల్పాహారం అందించనున్నారు.

తెలంగాణ ప్రభుత్వం, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఇంప్లిమెంటేషన్ పార్ట్‌నర్‌గా చేపడుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమంలో భాగంగా ఈ కిచెన్‌ను ఏర్పాటు చేశారు. భారీ స్థాయిలో ఆహారాన్ని తయారు చేసి, నిర్దేశిత పాఠశాలలకు సరఫరా చేసే విధంగా కేంద్రీకృత వ్యవస్థను రూపొందించారు.

**అధునాతన సాంకేతికతతో వంటశాల**

కిచెన్‌లో ఏర్పాటు చేసిన ఆధునిక సదుపాయాలను మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహారం అందించేందుకు తీసుకున్న చర్యలను అధికారులు వివరించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులకు ఒకేసారి అల్పాహారం సిద్ధం చేసేలా వంటశాలను రూపొందించారు.

విద్యార్థులకు ప్రతిరోజూ ఒకే రకమైన ఆహారం కాకుండా వారంలోని రోజులకు అనుగుణంగా విభిన్న మెనూను రూపొందించారు.

**నాలుగు నియోజకవర్గాల్లో 49,025 మంది విద్యార్థులు**

ఈ కార్యక్రమం ద్వారా కరీంనగర్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో మొత్తం 49,025 మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రయోజనం పొందనున్నారు.విద్యార్థులకు పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారు ఆరోగ్యంగా, ఉత్సాహంగా పాఠశాలకు హాజరై చదువుకునేలా అనుకూల వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు.

# సింగపూర్‌కు సర్కార్ ఆహ్వానం



హైదరాబాద్, సెప్టెంబర్ 16:భారత్ ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టేలా సింగపూర్ కంపెనీలను ప్రోత్సహించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆ దేశ ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందాన్ని కోరారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ సంస్థలకు అనువైన పెట్టుబడి వాతావరణాన్ని కల్పిస్తున్నామని తెలిపారు.

సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన ఎనర్జీ అండ్ ట్రేడ్ శాశ్వత కార్యదర్శి ఆగస్టిన్ లీ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం బుధవారం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమైంది. ఈ సందర్భంగా తెలంగాణలో పెట్టుబడులు, పారిశ్రామిక భాగస్వామ్యాలకు ఉన్న అవకాశాలపై ఇరువర్గాలు చర్చించాయి.

సెమీకండక్టర్ రంగంలో సింగపూర్‌కు ఉన్న సాంకేతిక, పారిశ్రామిక అనుభవాన్ని తెలంగాణతో అనుసంధానించాలని శ్రీధర్‌బాబు కోరారు. రాష్ట్రంలో సెమీకండక్టర్ ఫ్యాబ్ పరిశ్రమలతో పాటు అనుబంధ పరిశ్రమలు, సరఫరా వ్యవస్థ అభివృద్ధికి సింగపూర్ కంపెనీల భాగస్వామ్యాన్ని పెంచేందుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడులకు అనుకూలమైన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రి ప్రతినిధులకు వివరించారు. హై వాల్యూ ఇండస్ట్రీస్, పరిశోధన-అభివృద్ధి, టెక్నాలజీ ఆధారిత పరిశ్రమలకు అవసరమైన పారిశ్రామిక ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

**పలు రంగాల్లో పెట్టుబడులకు అవకాశం**

ఐటీ, ఐటీఈఎస్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్, గ్రీన్ టెక్నాలజీ, పునరుత్పాదక ఇంధనం, లాజిస్టిక్స్, సప్లై చైన్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆర్‌అండ్‌డీ, స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నోవేషన్ రంగాల్లో సింగపూర్ సంస్థలకు అవకాశాలు ఉన్నాయని మంత్రి వివరించారు.

ఈ రంగాల్లో తెలంగాణలోని అవకాశాలు, ప్రభుత్వ విధానాలు, పెట్టుబడి అనుకూలతలపై సింగపూర్ కంపెనీలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ప్రతినిధుల బృందాన్ని కోరారు.

డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2026'లో సింగపూర్ ప్రభుత్వం, ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొనేలా సహకరించాలని శ్రీధర్‌బాబు విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణలో పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమల విస్తరణకు మరింత ఊతం లభిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.సమావేశంలో టీజీఐఐసీ ఎండి శశాంక, సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సీనియర్ డైరెక్టర్ డా.ఫ్రాన్సిస్ చోంగ్, ఇండియా డైరెక్టరేట్ డైరెక్టర్ జీన్ యూ, సౌత్ ఏషియా ఎంటర్‌ప్రైజ్ డైరెక్టర్ ఆడ్రీ టూన్ తదితరులు పాల్గొన్నారు.

# వాళ్లను చరిత్ర క్షమించదు.. ప్రతిపక్షం తీరుపై సీఎం రేవంత్ ఫైర్

హైదరాబాద్, సెప్టెంబర్ 16:కొంతమందిని చరిత్ర ఎప్పుడూ క్షమించదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు(బుధవారం) శాసనసభలో మాట్లాడుతూ.. గతంలో జరిగిన తప్పులపై సభలో చర్చ జరుగుతుందనే ప్రధాన ప్రతిపక్షం కుట్ర చేసిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను కొల్లగొట్టిన అంశాలు చర్చకు రావొద్దని, ఫీజు రీయింబర్స్‌మెంట్, కరవు, కొంతమంది చేసిన క్షుద్ర పూజలు చర్చలు వస్తాయనే.. సభ మొదటి రోజే కుట్ర పూరితంగా వ్యవహరించారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రతి ఆడబిడ్డ సమానమే అని స్పష్టం చేశారు. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని కాపాడాలనేదే ప్రభుత్వ సంకల్పమన్నారు. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

సభాపతిని గౌరవించడం సభ్యుల సంప్రదాయమని సీఎం అన్నారు. సభలో ప్రతి సభ్యుడి హక్కులను కాపాడేది సభాపతి అని తెలిపారు. గత ప్రభుత్వమే సభ నిర్వహణపై కొన్ని నిబంధనలు రూపొందించిందని.. ఆ నిబంధనల మేరకే సభాపతి ఆదేశాలు ఇచ్చారని వెల్లడించారు. స్పీకర్ ఇచ్చిన ఆదేశాలను గేట్-3 వద్ద పోలీసులు అమలు చేశారని వివరించారు. పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ నల్ల టీషర్టు వేసుకుని వెళ్లారని ప్రతిపక్ష నాయకులు మాట్లాడుతున్నారని.. నినాదాలతో కూడిన టీషర్టులతో లోపలకి రాకూడదని స్పీకర్ ఆదేశాలిస్తే వారు పాటించేవారని తెలిపారు.

లోక్‌సభ స్పీకర్ పార్లమెంటులో అలాంటి నిబంధనలు విధించలేదని ముఖ్యమంత్రి తెలిపారు. కానీ తెలంగాణ శాసనసభలో ఎలాంటి నిబంధనలు ఉండాలో గత ప్రభుత్వమే రూపొందించిందని చెప్పుకొచ్చారు. పోలీసులను దూషించి, అర్ధ నగ్న ప్రదర్శన చేసి, సభాపతిని కూడా దూషించారని మండిపడ్డారు. దీనిపై స్పీకర్‌కు క్షమాపణ చెప్పి సమస్యలపై చర్చ చేస్తారని భావించే ప్రతిపక్ష నేతలను సభలోకి అనుమతించారన్నారు. కానీ విచక్షణ కోల్పోయి వ్యవహరించడం వల్లే బీఆర్ఎస్‌ను స్పీకర్ సస్పెండ్ చేశారని తెలిపారు. వారు సభకు రాలేదని ప్రజా సమస్యలపై చర్చించే భాధ్యతను విస్మరించలేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# ఎల్బీనగర్‌లో118 జీఓ సమస్యను పరిష్కరిస్తాం.. అసెంబ్లీ వేదికగా సీఎం హామీ

హైదరాబాద్, సెప్టెంబర్ 16:ఎల్బీనగర్ నియోజకవర్గంలోని ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. ఈరోజు(బుధవారం) శాసనసభలో మాట్లాడుతూ.. ఎల్బీనగర్ నియోజకవర్గంలో కొంతమంది ప్రజలు ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని.. ఏళ్ల తరబడి అక్కడే నివసిస్తున్నారని అన్నారు. వీరి సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపుతామని.. ప్రభుత్వ తరపున శుభవార్త చెప్పనున్నట్లు తెలిపారు. ఈ నియోజకవర్గంలో118 జీఓ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వ భూముల్లో లౌఅవుట్లు, నిర్మాణాలను క్రమబద్ధీకరిస్తామన్నారు. సికింద్రాబాద్ పరిధిలో ఫ్రీహోల్డ్, భూదాన్ భూ సమస్యను పరిష్కరిస్తామని రేవంత్ పేర్కొన్నారు.

## హైపవర్ కమిటీ నియామకం..

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని.. 22ఎ సమస్యల్లో 12 అంశాలను గుర్తించామని ముఖ్యమంత్రి తెలిపారు. 12 ప్రధాన సమస్యల పరిష్కారానికి హైపవర్ కమిటీని నియమిస్తామని ప్రకటించారు. 22ఏలో ఏ భూములను చేర్చాలనేదానిపై నిర్దేశిత విధానంతో ముందుకెళ్తామన్నారు. టోల్‌ఫ్రీ నెంబర్ పెట్టి సమస్య పరిష్కారానికి అడుగులు వేశామని చెప్పారు. సీఎం ఇల్లు 22ఎలో ఉందని వాళ్లే అంటున్నారని.. అది మంత్రి చేతుల్లో ఉండదని.. టెక్నికల్ సమస్య అని తెలుసుకోవాలన్నారు. 22ఎలో ఏదైనా భూమిని చేర్చే అధికారం.. ఆర్‌డిఓ లేదా సబ్‌కలెక్టర్లదే అని పేర్కొన్నారు. భూ సర్వే నంబర్, పట్టాదార్ వివరాలను స్పష్టంగా గుర్తిస్తారని తెలిపారు.

## ఆ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తాం..

యుఎల్‌సి భూముల విషయంలో త్వరలోనే నూతన విధానాన్ని తీసుకొస్తామని రేవంత్ తెలిపారు. నిషేధిత జాబితాలో పెట్టేముందు ఈ-కేవైసీ సహా ఈ-మెయిల్, పత్రికా ప్రకటన విధానాన్ని అనుసరిస్తామన్నారు. అభ్యంతరాలు తెలిపేందుకు 15 రోజుల సమయం ఇస్తామని.. మొత్తం అనుసరించిన విధానాన్ని రికార్డు చేస్తామని చెప్పారు. దేవాదాయ, వక్ఫ్ భూముల చట్టం ప్రకారం కొనుగోలు చేస్తే వాటిని నిషేధిత జాబితా నుంచి తొప్రకటించారు. అధీకృత లేఅవుట్లలోని భూముల పెండింగ్ రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తామన్నారు. హెచ్‌ఎండిఏ,డిటిసిని అనుమతులు పొందిన లేఅవుట్ రిజిస్ట్రేషన్లు చేస్తామని అన్నారు. సింగరేణి పరిధిలో అర్హత ప్రమాణాలకు అనుగుణంగా పట్టాలు ఇస్తామని చెప్పారు. సింగరేణి కార్మికులకు మేలు జరిగేలా పట్టాలపై నిర్ణయం తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# హోటల్‌లో గంజాయి విక్రయం.. ఇద్దరి అరెస్ట్

హైదరాబాద్, సెప్టెంబర్ 16: భాగ్యనగంలో మరోసారి భారీగా గంజాయి పట్టుబడింది. గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్(రాజూవఇతిజీశ్రీ ్ఱజీబని ఈనీతీఇవ) అధికారులు అరెస్ట్ చేశారు. కొండాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని ఓ హోటల్‌లో గంజాయి విక్రయాలు జరుపుతున్నట్లు గుర్తించారు. నిందితులు హోటల్‌లో చిన్న చిన్న ప్యాకెట్లుగా గంజాయిని విక్రయిస్తున్నట్లు ఎస్‌టీఎఫ్ అధికారులు తెలిపారు. అస్సాంకు చెందిన ధీరజ్ దాస్ (39), రబాలి అలీ(25)ని అదుపులోకి తీసుకున్న అధికారులు.. వారి వద్ద నుంచి రూ.9 లక్షలు విలువైన 17.1 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

వీరిద్దరూ గతంలో హైదరాబాద్‌లో సెక్యూరిటీ గార్డులుగా పనిచేసినట్లు విచారణలో తేలింది. జీతం సరిపోకపోవడంతో గంజాయి విక్రయాల వైపు మళ్లినట్లు ఎక్సైజ్ విచారణలో బయటపడింది. అస్సాం నుంచి గంజాయిని తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఆపై నిందితులిద్దరినీ కొండాపూర్ ఎక్సైజ్ పోలీసులకు ఎస్‌టీఎఫ్ అధికారులు అప్పగించారు.

# అరేబియా సముద్ర జలాల్లో ఢీకొన్న పాక్, భారత నౌకలు

న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 16: అంతర్జాతీయ సముద్ర జలాల్లో ఇండో, పాక్ నౌకలు ఢీకొన్నాయి(రాష్ట్రతిజూ అనీశ్రీశ్రీతిబతినీని). ఈ ఘటనపై ఇవాళ భారత్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. పాకిస్థాన్ నౌకాదళ వ్యవహారం ఆమోదయోగ్యంగా లేదని, దాని ప్రవర్తన ప్రొఫెషనల్‌గా లేదని భారత్ పేర్కొన్నది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ దౌత్యవేత్తకు భారత్ సమన్లు జారీ చేసింది. భారతీయ నేవీ నౌకను పాక్ నేవీ నౌక ఢీకొన్నట్లు విదేశాంగ వర్గాలు తెలిపాయి. ఈ ఘటన అంతర్జాతీయ జలాల్లో జరిగినా, భారతీయ నౌకకు డ్యామేజ్ జరగలేదని, కానీ పాకిస్థాన్ నౌకాదళ ప్రవర్తన సరిగా లేదని భారత్ పేర్కొన్నది.1991 నాటి నౌకావిన్యాసాల అగ్రిమెంట్‌లోని ఆర్టికల్ 10 ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లు అవుతుందని భారత విదేశాంగ శాఖ ఓ ప్రకనలో తెలిపింది. గత రాత్రి అరేబియా సముద్రంలో ఈ ఘటన జరిగినట్లు విదేశాంగ శాఖ వర్గాలు వెల్లడించాయి. పాకిస్థానీ విదేశాంగ శాఖకు ఈ విషయాన్ని చేరవేసినట్లు భారత్ తెలిపింది. పాక్ మిలిటరీ యూనిట్లు అన్నీ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచన చేసినట్లు చెప్పారు. పాకిస్థాన్ విదేశాగ శాఖ ముందు నిరసన వ్యక్తం చేయాలని ఇస్లామాబాద్‌లోని భారత ఎంబసీకి చెప్పినట్లు భారత విదేశాంగ శాఖ పేర్కొన్నది.

## చురక

ఉచితంగా యూపీఐ
ఉంచబోదు ఇక సేవ
చెల్లింపుల పైన ఇక
చార్జీలతో సాగు తోవ.
కార్పోరేటర్ల లాభానికి
కేంద్రమెట్ల నిర్ణయించే
పరోక్షంగా భారమేసి
ప్రజలనెట్ల వంచించే.



-వేల్పుల నారాయణ
9440433475

## రాధశ్రీ రాగాలు

జాతీయ వాదమ్ము
జాతికిడు మోదమ్ము
కలిగించు క్షేమమ్ము
అనును రాధశ్రీ !!
సంకుచిత వాదమ్ము
జాతి కిడు ఖేదమ్ము
కడకు మిగులును దుమ్ము
అనును రాధశ్రీ !!



-రాధశ్రీ
సెల్:9494481210

# జగిత్యాలలో దారుణం..

జగిత్యాల, సెప్టెంబర్ 16: జిల్లాలోని కోరుట్ల పట్టణంలో దారుణం చోటుచేసుకుంది. ఓ భర్త తన భార్య ముఖాన్ని టవల్‌తో చుట్టి ఊపిరాడకుండా చేసి హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని ఇంట్లోనే పడేసి పరారయ్యాడు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నం నరేశ్, లక్ష్మి దంపతులు జిల్లాలోని కోరుట్ల పట్టణంలో ప్రకాశం రోడ్డులో నివాసముంటున్నారు. నరేశ్ విద్యుత్ శాఖ కార్యాలయంలో ఆఫీస్‌బాయ్‌గా పనిచేస్తుండగా.. లక్ష్మి స్థానికంగా అంగన్‌వాడీ కార్యకర్తగా ఉద్యోగం చేస్తోంది. కాగా, నరేశ్.. భార్య లక్ష్మి ముఖాన్ని టవల్‌తో చుట్టేసి ఊపిరిరాడకుండా చేసి హత్య చేసి, పరారయ్యాడు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. హత్యకు గల కారణాలపై విచారణ చేస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ఆసుపత్రికి తరలించారు. నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.


ప్రేమ

## ఆహ్వానం

సేవ



**శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్**
**శ్రీ కృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం**
సంయుక్త ఆధ్వర్యంలో



ప్రముఖ రచయిత
**శ్రీ తిరుమల వెంకటస్వామి (టి.వి.స్వామి)**
రచించిన
**'మహాస్థపతి సిరిలూత'**
**(చారిత్రక నాటకం)**
**'అమెరికాలో నా అనుభవాలు'**
**(యాత్రానుభవం)**
**గ్రంథాల అవిష్కరణ - అంకితోత్సవ సభ**



తేది : 18-09-2026 శుక్రవారం సా॥ 05-30 గం॥లకు
వేదిక : శ్రీ కృష్ణ దేవరాయ తెలుగు భాషానిలయం, సుల్తాన్‌బజార్, కోఠి, హైదరాబాదు.

ముఖ్య అతిథులు & ఆవిష్కర్తలు :
పద్మశ్రీ పురస్కార గ్రహీత **ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు,**
విశ్రాంత ఉపకులపతి, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం
**"మహాస్థపతి సిరిలూత"** గ్రంథాన్ని ఆవిష్కరిస్తారు.
**శ్రీ మద్దాళి రఘురాం గారు,** కార్యదర్శి, కిన్నెర ఆర్ట్ థియేటర్స్
**"అమెరికాలో నా అనుభవాలు"** పుస్తకాన్ని ఆవిష్కరించి సమీక్షిస్తారు.

"మహాస్థపతి సిరిలూత" గ్రంథ అంకిత స్వీకర్త :
**డా॥ రేవూరి అనంత పద్మనాభరావు గారు,** విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ జనరల్, దూరదర్శన్, ఢిల్లీ
అమెరికాలో నా అనుభవాలు గ్రంథ అంకిత స్వీకర్త :
**శ్రీ బైస దేవదాస్ గారు,** 'నేటి నిజం' పత్రిక సంపాదకులు

సభాధ్యక్షులు : **ఆచార్య టి. గౌరీశంకర్ గారు,** పూర్వ రిజిస్ట్రార్, తెలుగు విశ్వవిద్యాలయం
పుస్తకసమీక్షకులు : **శ్రీ బండారుపల్లి రామచంద్రరావు గారు,**
మహాస్థిపతి సిరిలూత : ప్రముఖ విద్యావేత్త
ఆత్మీయ అతిథులు : **శ్రీ రవికుమార్ గారు & ప్రవీణ్‌కుమార్ గారు,**
"నమో నమో ప్రియ భారతమాత (పాటను స్వరపరిచి, గానం చేసినవారు)

**ఉడయవర్లు,** కార్యదర్శి, శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషానిలయం
**లలితవాణి**, ఉపాధ్యక్షులు, మానస ఆర్ట్స్
**రఘుశ్రీ**, కార్యదర్శ, మానస ఆర్ట్స్

నేటినిజం
# సాహితీ కెరటాలు

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 గురువారం 17-9-2026


## రుబాయిలు

జాగర్త సుమీ! మన బతుకులు గాలిలోదీపమట?
ఏది అసలు, ఏది నకిలీ తనఖీలలో లోపమట
పరిశుభ్రత..నాన్యతలా.. బోధపడునఆంతర్యం..!
నడుస్తున్న కాలంలో మన నమ్మకాలెశాపమట....

ప్రకటల మాయలోనె మనసుకవే పరుగులు
అత్యాశల బుద్ది నిండ కానరానిపురుగులు
తాగేది..తింటున్నది ఎంత మంచిదోరబాబు
భవిత యువత ఏమిటో...ఎండబెట్టు వరుగులు!

ఎవరిదారి వారు ఎగాదిగ వేసినారు అడుగులు
ఊసెక్కడ.. ధ్యాసెక్కడ.. లోతెరుగనిమడుగులు!
కొలతలకే అందనివట! కొనితెచ్చెడుముప్పులు
మర్మమేడ తెలియు, రాలునులె రోగాలపిడుగులు!



-మోతుకూరి అశోక్ కుమార్
9247380976

# డబ్బు-కీర్తి కథ!






- పి.చంద్రశేఖర అజాద్
92465 73575

భారతదేశంలో డబ్బుకి కొరత వుందని ఎవరన్నా అంటున్నారంటే అంతకంటే హాస్యం మరొకటి లేదు అని వికటాట్టహాసం చేస్తాడు మా మిస్టర్ క్లీన్. అందుకు కొన్ని ఉదాహరణలు ఆయన చూపించాడు. అవన్నీ మనమంతా రోజూ చూస్తున్నవే. చదువుతున్నవే. ముందు రాజకీయ నాయకుల గురించి పక్కన పెడదాం.

అలాంటివారిలో చాలామంది స్విస్ బ్యాంకుల్లో ఇంకా మరికొన్ని దీవుల్లో దాచు కుంటారు. అది ఎలా సాధ్యమో రకరకాల సినిమాల్లో చూపిస్తారు. కథలు నవలలు రాస్తుంటారు. అంతదాకా ఎందుకు - ఇప్పుడూ ఎప్పుడూ కాస్త కష్టం వచ్చినప్పు డల్లా కోట్లాది రూపాయల నోట్లు అచ్చొత్తిస్తారు. దానికి బంగారం నిల్వలతో పనిలేదు. అందుకే రూపాయి ధర ఎంతగా పడిపోతుందో సీరియల్ లా ఓ కాలమ్ నడుస్తుంటుంది. ప్రభుత్వాలు నోట్లు ప్రింట్ చేస్తారు. దొంగ నోట్లు తయారు చేసేవారూ అదే పనిలో వుంటారు. ఇంతకుముందు మనం కల్తీల గురించి, నకిలీల గురించి మాట్లాడ న్నాం కదా! చివరికి మన డబ్బు కూడా కల్తీ అయింది. ఇది భారతదేశానికే పరిమితం కాదు. అదలా వుంచుదాం.

ఇప్పుడు ఏ.సీ.బీ, సీ.బీ.ఐ, ఈ.డీ ల వారి తర్వాత రకరకాల ఏజెన్సీల సీరియల్స్ నడుస్తున్నాయి. ఏకకాలంలో ఓ వ్యక్తికో, సంస్థకో చెందిన ఆస్తుల మీద అనేక చోట్ల, అనేక రాష్ట్రాల్లో దాడులు జరుగుతు ంటాయి. చివరకు అటెండర్ మీద దాడి జరిగినా 50 సీ.ఆర్ తక్కువ దొరకటం లేదు. ఇంకా ఆ పైనున్న వారికి వారి అధికార స్థాయిని బట్టి వందలు దాటిపోతు న్నాయి. ఐదు లక్షలో, పది లక్షలో దొరికాయంటే వారికి అవమానం. ఇప్పుడు మిలియన్స్ పోయి బిలియన్స్ లోకి చేరాయి. అవి ట్రిలియన్స్ గా మారటానికి ఎంతో కాలం అవసరం లేదు.

ఇవి ఉద్యోగాలు చేస్తున్నవారి సంగతులు. ఇంకా సంస్థలు వున్నాయి. రకరకాల వ్యక్తులు వున్నారు. వాళ్ళ సంపాదనకంటూ అంతూ పొంతూ వుండదు. బహిరంగ మార్కెట్లో వాటి విలువలు అంచనా వేయటానికి సంవత్సరాలు పడతాయి. అసలు ఇవన్నీ పక్కన పెడదాం. ఇందులో ఎవరికన్నా శిక్షలు పడుతున్నాయా?

డబ్బులు సంపాదించకపోవడం నేరం. అందుకు ఎవరైనా శిక్షలు అనుభవిం చాల్సిందే. అందుకే కదా ఇన్ని ట్యాక్స్ లు! గతంలో జుట్టు పెంచితే, పెంచకపోతే, మాట్లాడితే, మౌనంగా వుంటే రకరకాల పన్నులని జోకులు పేలేవి. ఇప్పుడు గాలి పీల్చాలన్నా పన్నులే కదా! ఇవి పైకి కనపడవు. అందుకే మా క్లీన్ గారు చెప్పినట్లు డబ్బుకి కొరత వుంది అని ఎవరన్నా అంటే అది డబ్బు సంపాదించడం చేతకానివారి మాట. ఇలాంటి గగ్గోళ్ళు ఇన్ని దశాబ్దాల నుండి మనం వింటున్నవే.

అసలు ప్రపంచం ఎందుకింతగా పతనమైంది? డబ్బు మనుషులను, దేశాలను, ప్రపంచాన్ని నడిపిస్తోందని మనుషులందరికి అర్థం అయిపోయింది కదా! ఇందుకు పరిష్కారం వుందా? ఇది మా ప్రశ్న.

''అరేయ్ పిల్లలూ! బతికుంటే బలుసాకు తింటాం అంటారు నిన్నటి తరం వారు. ఇప్పుడు నూడిల్సో, పిజ్జాలో, బర్గర్సో తింటాం అంటారు. ఇలాంటి ప్రశ్నలు అడిగితే చావగొట్టి చెవులు మూస్తారు. ఈ పని ప్రభుత్వాలు మాత్రమే చేయవు. ఎక్కడ డబ్బు పెరిగిపోతుందో అక్కడ అణచివేత వుంటుం ది. నేను ఏదో మనసూరుకోక ఏదో ఒకటి అంటాను. దాన్ని సీరియస్ గా తీసుకోకండి రా బాబులూ!'' అన్నాడు మా మెంటార్ మిస్టర్ క్లీన్!

××××××

మాటమీద నిలబడటం చాలా కష్టం. మనుషులంతా మూటల మీద, అదే డబ్బుల మూటల మీద వున్నారు కదా. మా మిస్టర్ క్లీన్ మళ్లీ వచ్చాడు.

''పిల్లలూ - మీరు కథలు రాయాల నుకుంటున్నారా?'' అనడిగాడు.

''ముందు మీలాంటివారు చెప్పే కథలు వినాలి అనుకుంటున్నాం. అయినా నిన్ననే కదా మీరు వార్నింగ్ ఇచ్చారు. ప్రశ్నలు అడిగినా ప్రభుత్వాలే కాదు మనుషులు చావగొట్టి చెవులు మూస్తారని. అందులోనూ డబ్బున్న వాళ్ళు అని'' అంది అన్య.

''చిన్న సవరణను మనం చేసుకుందాం. చావగొట్టి చెవులు మూయటానికి డబ్బున్న వాళ్ళే అవసరం లేదు. కండబలం, నోటి బలం వున్నవారు కూడా నిరంతరం తయా రుగా వుంటారు. కాకపోతే వాళ్లు డబ్బున్న వారికోసం పనిచేస్తుంటారు'' అన్నాడా యన.

''అసలు ఇలాంటివారు డబ్బున్న వారినే చావగొట్టి చెవులు మూస్తే వారే డబ్బున్న వాళ్ళు అవుతారు కదా!'' అన్నాడు విదు.

''ఇక్కడ మీకు మనుషుల తత్వం గురించి బోధించాలి పిల్లలూ! ఇలాంటి వారిలో చాలామంది కండలు పెంచుతారు బుద్ధిని కాదు. వాళ్ళు డబ్బుని, మాటను పొదుపు చేయాలనుకోరు. సాయంకాలానికి మద్యం సేవించాలి. కోడినో మేకనో, ఇంకో జీవినో భోం చేయాలి.

అలాగే ఎవరు మీటింగ్‌కి పిలిచినా గంతులు వేయాలి. పెడబొబ్బలు పెట్టాలి. పనిలో పనిగా ఎవరి మీద అయినా దాడులు చేయాలి. తర్వాత ఊచలు లెక్కపెట్టాలి. అంతేగాని రేపు అనేది ఒకటి వుంది అని అనుకోరు. అలా మానవ రోబోలను తయారు చేస్తుంటారు.''

''అందరూ ఇలానే వుంటారా?'' అన్నాను నేను.

''అందరూ ఎందుకు వుంటారు మేంగో? కొంతమందికి ముందుచూపు వుంటుంది. వాళ్ళు మద్యం తాగినా, గొడవలు చేసినా ప్రణాళిక వుంటుంది. లెక్కలు వేసుకుంటారు. డబ్బుని నిల్వ చేసి మూటలు కడతారు. ఆ రకంగా కొత్త యజమానులు అవుతారు. వారి కోసం ముందు చెప్పుకున్న జీవులు పనిచేస్తుం టాయి.''

''వాళ్ల కళ్ళు తెరవరా?'' అన్నాను.

''తెరవరు. తెరవనీయరు.''

''మీ మేధావులు కూడా అంతేనా?'' అంది అన్య.

''వాళ్ల మనుషులు కాదా! మామూలు మనుషుల కంటే మేధావులకు బలహీనతలు ఎక్కువ వుంటాయి అన్యా! ఇందులో రెండు మూడు రకాల వారు వుంటారు. శాలువాలకు, ప్రశంసలకు, చిన్నచిన్న అవార్డులకి మురిసిపోయేవారు ఒకరకం. మరోరకం వారు వీటికి లొంగరు. వారు మూటలు కడుతుంటారు. మాటల మూటలు కాదు. వీరికి వున్నంత ముందుచూపు ఇంకొకరికి వుండదు.''

''అలాంటి వారు డైరెక్టుగా సంపాదించుకోవచ్చు. వారికి పార్టీలు ఎందుకు? సంస్థలు ఎందుకు? అలాగే అభ్యుదయ ప్రీచింగ్స్ ఎందుకు?'' అన్నాను.

''ఓ కుటుంబంలో ముగ్గురు వుంటే మూడు పార్టీల్లో చేరతారు. అంటే ఎవరో ఒకరు అధికారంలో వుంటారు. మనుషులకు డబ్బు మాత్రమే తృప్తిని ఇవ్వదురా, కానింత కళాపోషణ వుండాలి. ఇలాంటివారు కీర్తి మూటలు కడుతుంటారు.

నువ్వు అన్నట్లు ఎవరైనా సరే నేను సంపాదించుకుంటాను. ఇవన్నీ నా మనసునుండి రావడం లేదని చెప్పరు. అక్కడ చాలా పోటీ వుంటుంది. ఇక్కడా మొదలయ్యాక ఇంకో మార్గం వస్తుంది. మనం మాట్లాడుకోవాల్సిన విషయాలు చాలా వున్నాయి. ఇది సముద్రమంత విషయం'' అన్నాడు క్లీన్.

''ఇంతకీ కథల గురించి?'' అంటోంది అన్య.

''ఇవన్నీ కథలే. దాని గురించి వివరంగా మళ్ళీ మాట్లాడుకుందాం'' అన్నాడు మిస్టర్ క్లీన్!

## గొప్ప ఆలోచనలు రేకెత్తించే 'వారేరీ'

-పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్



"వారేరీ" పుస్తకావిష్కరణలో రఘుశ్రీ, బండారుపల్లి రామచంద్రరావు, ఆచార్య టీ. గౌరీశంకర్, ఆచార్య కొలకలూరి ఇనాక్, మాయకుంట్ల నారాయణరెడ్డి, బైస దేవదాసు, జెల్ది విద్యాధరరావు.

హైదరాబాద్, సెప్టెంబర్ 15(నేటినిజం ప్రతినిధి): సుమారు పాతిక మంది ప్రముఖ వ్యక్తులు గురించి విశ్లేషాత్మక వ్యాసాలు రచించిన రచయిత మాయకుంట్ల నారాయణ రెడ్డి ప్రతిభకు నిదర్శనమని శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం పూర్వ ఉప కులపతి పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్, శ్రీ త్యాగరాయ గాన సభ సంయుక్త ఆధ్వర్యంలో గాన సభలోని గుండవరపు హనుమంతరావు కళా వేదికలో ప్రముఖ మాయకుంట్ల నారాయణ రెడ్డి రచించిన **"వారేరీ...?"** సాహిత్య వ్యాస సంపుటి ఆవిష్కరణ సభను నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆచార్య కొలకలూరి ఇనాక్ వారేరీ...!? సాహిత్య వ్యాస సంపుటిని ఆవిష్కరించారు. అనంతరం ఇనాక్ మాట్లాడుతూ.. మన మనసులో ఆలోచనలు రేకెత్తించే తులనాత్మకమైన వ్యాసాలను చక్కని శైలిలో అనేక విషయాలు రాసిన మాయకుండ్ల నారాయణ రెడ్డిని అభినందించారు. నేటి విద్యార్థినీ, విద్యార్థులకు ఈ పుస్తకం కరదీపిక వంటిదని ఆయన అన్నారు. సభకు అధ్యక్షత వహించిన సాహితీవేత్త ఆచార్య టీ. గౌరీశంకర్ మాట్లాడుతూ.. ఈ సంపుటిలో రవీంద్రనాథ్ ఠాగూర్, సర్వేపల్లి రాధాకృష్ణ, సి. నారాయణ రెడ్డి, విద్వాన్ విశ్వం, కాళోజీ, దువ్వూరి రామిరెడ్డి, స్వామి వివేకానంద, వేమన గురించి చాలా వివరంగా రాశారని అన్నారు. అదే విధంగా నెల్లూరుకు చెందిన బంగోరె గురించి చాలా చక్కటి వ్యాసం రాసిన మాయకుంట్ల నారాయణ రెడ్డి అభినందించారు. చాలా విలువైన వ్యాసాలు ఈ సంపుటిలో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రచయిత మాయకుంట్ల నారాయణరెడ్డి తాను రచించిన వారేరీ..!? సాహిత్య వ్యాస సంపుటిని సాహితీవేత్త నేటినిజం సంపాదకులు బైస దేవదాసుకు అంకితమిచ్చారు.



"వారేరీ" పుస్తకాన్ని నేటినిజం సంపాదకులు బైస దేవదాసు దంపతులకు అంకితమిస్తున్న మాయకుంట్ల నారాయణ రెడ్డి దంపతులు, అతిథులు



రచయిత మాయకుంట్ల నారాయణ రెడ్డి దంపతులను సత్కరిస్తున్న అతిథులు

పుస్తకాన్ని అంకితం తీసుకున్న బైస దేవదాసు మాట్లాడుతు పలు సినిమాల్లో నటించిన నారాయణరెడ్డి సాహిత్యంలో పట్టు సాధించారని తన కలం నుండి వెలువడిన ఐదు పుస్తకాల్లో నాల్గు కవిత్వ సంపుటులయితే ఈ ఐదో పుస్తకం వ్యాస సంపుటి అని వివరించారు. కవిత్వంతో పాటు గతించిన మహామహుల రచనలపై వ్యాసాలు రాయమని కోరిన వెంటనే అద్భుతమైన రచనలు చేశారని, అవన్నీ నేటినిజం పత్రికలో ప్రచురించడం జరిగిం దని అన్నారు. ఈ సంపుటిని తనకు అంకితం ఇవ్వడం తనకెంతో ఆనందంగా వుందని, నారాయణరెడ్డి సాహిత్య కృషిని అభినందించారు.

రచయిత నారాయణరెడ్డి దంపతులను సభలో పాల్గొన్న అతిథులు ఘనంగా సత్కరించారు. రచయిత నారాయణరెడ్డి తాను రాసిన వ్యాస సంపుటిలోని పలు వ్యాసాలు గురించి వివరంగా మాట్లాడారు. ఈ సభలో కవులు నోరి రాజేశ్వరరావు, జెల్ది విధ్యాధరరావు తదితరులు ఈ వ్యాస సంపుటిలో ఉన్న పలు వ్యాసాలు గురించి వివరంగా మాట్లాడారు. మానస సంస్థ కార్యదర్శి, కవి డా॥ రఘుశ్రీ సభకు స్వాగతం పలికారు. ఈ సభలో సంస్థ అధ్యక్షుడు, రచయిత బండారు రామచంద్రరావు, ఉపాధ్యక్షులు డా॥లలిత వాణి తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు జరిగిన కవి సమ్మేళనంలో పలువురు కవులు, కవయిత్రులు స్వయ కవితా గానం చేశారు. కవులు పెద్దూరి దాసు, మిద్దె సురేష్ సమన్వయ కర్తలుగా వ్యవహరించారు.

# పాటకు సరికొత్త పల్లవి డాక్టర్ సుద్దాల అశోక్ తేజ



ఈ నెల 22 న కరీంనగర్‌లో "తెలుగు భాషా సంరక్షణ సంఘం-తెలంగాణ" నిర్వహణలో 2026 సంవత్సరానికి కీ.శే.బుర్ర నర్సమ్మ- రెడ్డి స్మారక రాష్ట్ర స్థాయి **"తెలంగాణ తెలుగు తేజం"** సాహిత్య పురస్కారం సాహితీ వేత్త, ప్రముఖ సినీ గేయకవి డాక్టర్ సుద్దాల అశోక్ తేజ అందుకోబోతున్న సందర్భంగా ..

పాట ఆ ఇంట్లో పురుడు పోసుకుంది .తండ్రి ప్రజాకవి సుద్దాల హనుమంతు గైకట్టిన పాటలు ప్రజల రసనాలపై చిరస్థాయిగా నిలిచిపోయాయి .ప్రజా సాహిత్యం అ న ప్రజల కవి ఆయన. ''పల్లెటూరి పిల్లగాడ'' ఈ ఒక్క పాట చాలదూ! హనుమంతు ప్రతిభా విశేషాలను పట్టి చూపడానికి.అలాంటి పాటల నేపథ్య మున్న కుటుంబం లోంచి ఎదిగి వచ్చిన కవి, గేయకవి డాక్టర్ సుద్దాల అశోక్ తేజ.తమ ఇల్లు ఒక సాంస్కృతిక నిలయంగా ఎప్పుడూ కవులు, కళాకారులతో కళకళలాడుతూ వచ్చింది.

అక్షరాలను హృదయ ఫలకంపై దిద్దుకున్న పూప వయస్సులోనే మహాకవి శ్రీశ్రీ మహాప్రస్థానం కంఠస్థం చేసి ఆనాటి అధ్యాపకులను అబ్బురపరిచాడు. కళాశాల స్థాయిలో "వెలయాలువా సంఘం వెలివేసిన వెలిదివా" అని వేశ్య జీవితంలోని భిన్న పార్శ్వాలను పాటగా మలచి కళాశాల వార్షికోత్సవంలో ఆలపించగా విశేష స్పందన లభించింది.ఒకవైపు నాటకాలు , ఏకపాత్రా భినయాలు చేస్తూ పాటపై మక్కువను పెంచుకున్నాడు.

ఈ క్రమంలో ఆయన నటించిన' ఊరు పిశాచాలు' నాటకం మిక్కిలి ప్రాచుర్యాన్ని పొందింది.మెట్ పల్లితో ముడిపడిన ఆయన జీవితం పాటల రచయితగా ఎదగడానికి ఎంతో తోడ్పడింది. అక్కడి సాహిత్య సంస్థలతో పాటు డాక్టర్ అందె వెంకటరాజం వంటి సాహితీవేత్తల ప్రోత్సాహం, ప్రేరణ కూడా తోడైంది .అప్పటికే కవులుగా ,లబ్ద ప్రతిష్టులైన సినీగేయ కవులుగా ఘనతకెక్కిన దేవులపల్లి, శ్రీశ్రీ ,దాశరథి, సినారె పాటల ప్రభావం కూడా అశోక్ తేజ పైన పడింది. అంతేకా కుండా , చలం శరత్ చంద్ర , రంగనాయ కమ్మ, తెన్నేటి హేమలత వంటి రచయితల ,రచయిత్రుల ప్రభావం కూడా అతనిపైన ఎక్కువే అని చెప్పుకోవాలి. సినారెను తన పాటల తండ్రిగా భావిస్తాడు..తన పాటల వారసుడు అశోక్ తేజ అని సినారె కూడా పలు సాహిత్య వేదికల మీద ప్రకటించాడు.

మెట్ పల్లిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగిస్తున్న కాలంలో పగలు పాఠశాల విద్యార్థులకు బోధిస్తూనే 'అక్షర ఉజ్వల' కార్యక్రమానికి వయోజనులలో అక్షర జ్ఞానం కలిగించాలన్న ఆశయంతో "చదువు శానా సులువు చిన్నక్క" అంటూ రాసిన పాటలు ఆ ప్రాంతంలో గొప్ప ఉత్తేజాన్ని కలిగించాయి .పల్లె ప్రజల సామాజిక చైతన్యం కోసం చిన్నచిన్న నాటికలు ఏకపాత్రలలో కూడిన రచనలు పలు చేశాడు. రెండు దశాబ్దాలు మెట్ పల్లి జీవితం తన పాటలకు నేపథ్యంగా నిలిచిందని అశోక్ తేజ అంటాడు . 1985లో 'వెలుగు రేఖలు' పేరుతో ఒక నవలను రాశాడు . కరీంనగర్ మాండలికంలో గ్రామీణ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు నేపథ్యంగా ఈ నవల సాగుతుంది. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో ద్వితీయ బహుమతి అందుకుంది.అదే విధంగా 1988లో వెలువరించిన' వీర తెలంగాణ 'సాంఘిక యక్షగానం నిజాం పాలన నాటి పరిస్థితులను, ప్రజలు ఎదు ర్కొంటున్న ఇబ్బందులను పట్టి చూపు తుంది. తన తండ్రి సుద్దాల హనుమంతు ఈ యక్షగాన రచన ప్రారంభిస్తే అశోక్ తేజ పూర్తి చేశాడు .తండ్రి, తనయుడు ఇద్దరు కలిసి చేసిన రచనగా తెలుగు సాహిత్య చరిత్రలో ఈ యక్షగానం ఒక ప్రత్యేకతను సంపాదించుకుంది.

పిల్ల కాలువలు అన్నీ కలిసి ఒక పెద్ద ప్రవాహమైనట్టు గేయకవిగా తొలినాళ్లలో ఆయా ఇతివృత్తాలపై రాసుకున్న పాటల్లో కొన్నింటిని ఎంపిక చేసుకొని 42 పాటలతో 1989లో 'బతుకు పాటలు 'పేరుతో ఒక సంపుటి ముద్రించాడు .మనిషి అస్తిత్వానికి సంబంధించిన ఆరాటం, పోరాటం, ఉద్యమం ఈ పాటలలో అగుపి స్తుంది. 2002లో ప్రచు రించిన 'ఆకుపచ్చ చందమామ'లో కొన్ని ఆయా సంద ర్భాలకు రాసిన పాటలతో పాటు సినీ రంగానికి వచ్చాక రాసిన పాట లు ఈ సంపుటిలో ఉన్నాయి .20 07లో 'నేలమ్మా... నేలమ్మా ' పేరిట మరో సినీగేయ సంపుటిని తీసుకు వచ్చాడు. ఆ రోజు ల్లో మిక్కిలి ప్రాచుర్యం పొందిన పాట లలో ఓ 60 ఎంపి క చేసుకొని విశాలా ంధ్ర వారు ఈ పాటల సంపుటిని ముద్రించారు. ఈ సంపుటిపై కవి ,విమర్శకుడు గోప గాని రవీందర్ సాధికార పరిశోధన చేసి ఎం.పిల్ పట్టా అందుకు న్నాడు. 2016లో ప్రచు రింపబడిన 'శ్రమ కావ్యం' అశోక్ తేజ రచనల్లో అగ్ర భాగాన నిలుస్తుంది .నిజానికి ఆయన పాటల్లో "శ్రమ" అన్న రెండు అక్షరాల పదానికి పెద్దపీట వేస్తాడు .జాగ్రత్తగా గమనిస్తే చాలా పాటలు శ్రమ నేపథ్యం గానే సాగుతుంటాయి. శ్రీశ్రీని తలపిస్తుంటాయి. ఒకచోట దాసరి నారాయణ రావు అన్నట్టు "సినీ రంగానికి బుల్లి శ్రీశ్రీని పట్టుకు వచ్చాను "అన్న మాటలు అక్షర సత్యా లు అనిపిస్తాయి. మానవుని పరికిం చి.....పఠించి... తిరిగి నేటిదాకా నడుస్తూ.... గమనిస్తూ... వివరిస్తూ... కవిత్వీకరిస్తే 'శ్రమ కావ్యం 'అవుతుంది .ఈ శ్రమకావ్యాన్ని కావ్యగానం చేస్తూ తెలుగు నాట దాదాపు 65 కావ్య గానాలు నిర్వహించాడు కవి అశోక్ తేజ."ఈ జగతి జనించెను శ్రమ నుంచి ,ఈ ప్రగతి ఫలించెను శ్రమ నుంచి ,ప్రకృతి తోడుగా ప్రపంచమంతా ప్రయాణించునది శ్రమ నుంచి అంటూ" శ్రమైక వేదాన్ని ప్రకటిస్తాడు. ఆదిమ కాలం నుంచి అణ్వస్త్ర యుగం దాకా సాగివస్తున్న ప్రగతి వెనక శ్రమ తేజస్సు దాగి ఉందంటాడు.అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ 'నేను అడవిని మాట్లాడుతున్నాను' ' శ్రీ శూద్రగంగ '' అశోకవనం వంటి దీర్ఘ కావ్యాలను వెలవరించాడు .అంతేకాదు, కావ్య గానాలు చేస్తూ శ్రోతల హృదయాలకు చేరువవుతున్నాడు. కవిత్వం ఒక వైపున ,సినీగేయ సాహిత్యం మరొక వైపున సవ్యసా చిగా సమాంతరంగా రాణిస్తున్న ప్రతిభ అశోక్ తేజ సొంతం. తాను రాసిన పాటలను అందంగా అలపిస్తాడు. వక్తగా వేదికలను మెప్పి స్తాడు. ఆత్మీయతకు ఓ చల్లని వృక్షరాజం ఆయన.

ఈ క్రమంలో ఆయన దాదాపు 3000 వేల సినీగీతాలు రాశాడు .అందులో జాతీయ ఉత్తమ గేయ పురస్కారం పొందిన అగ్నినేత్ర మహోగ్రజ్వాలా దాచిన ఓ రుద్రుడా, ఇంకా ఆలు నీకు దండవే ,ఒకటే జననం, ఏటయ్యిందే గోదారమ్మ, నెమలీకన్నోడా , రామ సక్కనోడమ్మా చందమామ ,అందాల మా ఊరి అక్కాచెల్లెళ్ళు ,పాటల పల్లకిలో , దేవుడు వరమందిస్తే ,కొమురం భీముడో, కొమ్మా ఉయ్యాలా కోన జంపాలా వంటి పాటలు జనరంజకమై నిలిచాయి. నేలమ్మ నేలమ్మ ,ఆకుపచ్చ చందమామ, టప టప చెమట బొట్లు తాళాలైపడుతుంటే ..వంటి పాటలు జనజీవన శ్రమకు పట్టం కట్టాయి. తెలంగాణ నేపథ్యంలో రాసిన పాటలు సైతం అస్తిత్వ ఉద్యమానికి ఎంతగానో దోహద పడ్డాయి, స్త్రీలకు తిలకం దిద్దే పాటలు రాయడంలో చెయ్యి తిరిగిన కవిగా గుర్తింపును పొందాడు .పలు నంది అవార్డులతో పాటు కళాసాగర్ ,వంశీ బర్కిలీ ,ఆత్రేయ మనస్విని, సినీగోయల్ పురస్కారాలు అందుకున్నాడు . అంతే కాకుండా ,ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయల నగదు పురస్కారంతో గొప్పగా సత్కరించింది. దాదాపు నాలుగు దశాబ్దాల సాహిత్య ప్రస్థానంలో మేలిమి మలుపులు ఎన్నో అధిగమించాడు .తెలంగాణ ప్రాంతం నుంచి తొలి జాతీయ ఉత్తమ సినీగేయ పురస్కారం అందుకున్న సినీగేయకవిగా చరిత్రను సృష్టించాడు. ఆయన నిరంతర కవితా ప్రవాహం. .ఆరని కవితాక్షర జ్వాల. డాక్టర్ సుద్దాల అశోక్ తేజ ఇన్నేళ్ల తన కవితా సృజన ప్రస్థానంలో జాతీయ పురస్కారంతోపాటు పలు ఉత్తమ పురస్కారాలు అందుకు న్నాడు.గీతం విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ తో సత్కరించింది. ఆ క్రమంలో మరో ప్రతిష్టాత్మక పురస్కారాన్ని ఈనెల 22న కరీంనగర్ లో జరిగే కార్యక్రమంలో అందు కోబోతున్నాడు ".తెలుగు భాషా సంరక్షణ సంఘం- తెలంగాణ" సంస్థ ఆధ్వర్యంలో "తెలంగాణ తెలుగు తేజం" పేరిట కీ. శే.బుర్ర నర్సమ్మ లింగారెడ్డి స్మారక సాహితీ పురస్కారం 2026 సంవత్సరానికి గాను ప్రముఖ కవి,జాతీయ ఉత్తమ సినీగేయ పురస్కార గ్రహీత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ కు ప్రదానం చేస్తున్నట్లు పురస్కార కమిటీ ఛైర్మన్ ,తెలుగు భాషా సంరక్షణ సంఘం - తెలంగాణ సంస్థ ప్రధాన కార్యదర్శి లయన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి ,సంస్థ అధ్యక్షుడు ప్రముఖ సాహితీవేత్త, విమర్శకుడు దాస్యం సేనాధిపతి తెలిపారు. గతంలో ఈ పురస్కారాలను నేటినిజం దిన పత్రిక సంపాదకులు బైస దేవదాసు ,ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నందిని సిధారెడ్డి అందుకున్నారు. ఈ నెల 22 కరీంనగర్ లో జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల డైరెక్టర్ శ్రీ జీ.వీ.శ్యాంప్రసాద్ లాల్ ఐ.ఏ.ఎస్ పాల్గొనే ఈ సభకు దాస్యం సేనాధిపతి అధ్యక్షుడిగా వ్యవహరిస్తాడు.

-డా॥పోరెడ్డి రంగయ్య



## కవితార్చన

అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది.
అందులో ముఖ్యమైన కొన్ని కవితలను
నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

## లక్ష్యం లేని చదువెందుకు

గమ్యం లేని నడక ఎందుకు
లక్ష్యం లేని చదువు ఎందుకు
సమయం అన్నది అందరికొకటే
సాధన చేసే"ఆరాటం"కావాలి
నడవాలంటే అడుగేయాలి
పట్టుదలతో ప్రయత్నిస్తే
సాధ్యం కానిది లేదు జగతిలో
నిర్లక్ష్యం నీలో ఉంటే
సోమరితనం నిన్ను వెంటాడును
అడుగేయడం భయపడి ఆపితే
అవిటి తనం నీ జీవితం
పడుతూ లేస్తూ" పోరాటం చేస్తే
పరుగెత్తడం సులువవుతుంది
పడిపోతానని భయపడితే
అడుగు పడుదు ముందుకు
చదవాలని నీలో ఉంటే
నిన్ను మించినా యోగ్యుడు లేడు
మొదలు పెడితేనే కదా
పని పూర్తి చేసేది
ఆలోచనలకు పదును పెడితే
ఆశయం సిద్ధిస్తుంది
సమయం విలువైనది
నీ కోసం ఆగదు సమయం
సమయాన్ని వృదా చేస్తే
"జీవితం"బరువు అవుతుంది
సాధించాలనే కసి నీలో ఉంటే"లక్ష్యం"
చేరువ అవుతుంది

**-నక్క కుమారస్వామి**
9515147320

## వారికి ఇవ్వొద్దు

మొహంలో కనిపడేది నవ్వు ...
ఆ నవ్వు వెనుక కుట్ర.
మెరిసేదంతా బంగారం కాదని
తెలియని అమాయకులు.
మోసం చేయడానికి కావలసిన అమాయకులు.
మోసగింపబడే వాళ్ళు
ఉన్నంతకాలం ఉండే గోముఖ వ్యాఘ్రాలు.
చూపించే ప్రేమాప్యాయతలు నటన.
మభ్యపెడతారు ఎటులైనా!
మోసపోయే సంఘటనలు సృష్టిస్తారు ఎన్నైనా.
నమ్మిన వారికి మిగిలేది కితకిటన.
అమాయకుల బలహీనతలు వారికి ఆయుధాలు.
అతి సులువుగా తెంచేస్తారు బంధాలు.
వెన్నుపోటుతో కూల్చేస్తారు అనుబంధాలు.
గోముఖ వ్యాఘ్రాలు తలుచుకుంటే
మిగిలేవి అంధకారాలే.
మనుషుల మధ్య గోముఖ వ్యాఘ్రాలు.
నమ్మకస్తుల స్థితిలో అల్లకల్లోలాలు.
అల్లకల్లోలమైన స్థితిలో పోవచ్చు అనుబంధాలు.
అనుబంధాలు పోయాక పోవచ్చు ప్రాణాలు.
గోముఖ వ్యాఘ్రాలకు తెలియదు మంచీ
చెడుల అంతరువు.
వారు సృష్టించిన అపవాదులతో
పోతుంది పరువు.
అమాయకుల బ్రతుకు అవుతుంది బరువు.
అటువంటి వారికి ఎప్పుడూ ఇవ్వద్దు అదరువు

**- విత్తనాల విజయకుమార్**
99851 17789

## కథ ముగిసిపోయింది

తల్లిదండ్రు మీద దయలేని పుత్రుడు
పుట్టనేమి వాడు గిట్టనేమి అన్నట్టుగా
వయసు ఉడికిపోయి ఏ పని చేతకాకుండా
ఉన్న తల్లిని చూసి
చీటికిమాటికి విసుక్కునే తనయుడు
తన పుట్టుకను తన పెరుకువను విస్మరించిన
విశ్వాసఘాతకుడు
తనని నవమాసాలు మోసి కని పెంచి
అహర్నిశలు తన ఉన్నతి కోసమే శ్రమించిన
కన్నతల్లి వృద్ధాప్యంలో బరువైపోతే
తన పేగు తెంచుకొని పుట్టిన ప్రేమ పంచిన
తన కొడుకే
తనని ప్రేమగా కడగాక చూసుకుంటాడని
గంపడాశతో ఉన్న తల్లికి
నిరాశే మిగిల్చి ఆమెని చీదరించుకుంటే
దిక్కెవరు లేని స్థితిలో
మనసుకు ఏర్పడ్డ అగాధంతో
తనువునే చాలించిన ఆ పిచ్చి తల్లి
మనిషి ఉన్నప్పుడు తెలియని విలువ
మనిషిపోయాక తెలిస్తే ఏమి లాభం
కథ ముగిసే పోయిన తర్వాత
ఏదయ దక్షిణ్యంలేని
కర్కోటకుడైన ఆ తనయుడు
తల్లి సమాధిపై పడి రోధించినా
అసువులు బాసిన
ఆ కన్నతల్లి తిరిగి వస్తుందా!
ఇప్పుడు రోదిస్తే
ఏం లాభం కథ ముగిసే పోయింది

**-సీర సంగీత శ్రీ**, 95818 29298

## అమ్మ మనసు

ఉన్ననాడు ఉబుది పుల్ల
పోతే బంగారు పుల్ల
అనేది ఓ అద్భుతమైన సామెత
ఉన్నన్నాళ్లు అరిచి కొట్లాడితే
తిడితే ఏం సాధించావు..
పోయాక తల సమాధికేసి
కొట్టుకుంటే ఏమిటి లాభం....
తల్లి రా... నిన్ను నవమాసాలు
మోసి కన్న పిచ్చిదిరా...
ఏమి నీ నుండి ఆశించని వెర్రిదిరా...
నీ ప్రగతి ఎన్నటికీ తనకు
ఆనందమే..
నీ ప్రేమ కోసం ఎపుడూ
పరితపించే హృదయమే ఆమె..
నీవే తప్ప ఇతరుల గురించి
ఆలోచించని ఆలోచన కూడా లేని
అమాయక ప్రాణి ఇలలో ఒక్కటే
... అదే నిను కన్న తల్లి..
రత్నం చేజారింది ఇక నీ
జీవితమంతా ఏడ్చినా
దొరకనే దొరకదు
ఉన్నప్పుడు జాగ్రత్తగా దాచుకో
గుండె గుడిలో
పూజించుకో దేవతలా....
నీవు కోపగించుకుంటే తన
అమాయకపు చూపు
నీపైనే ఎందుకంటే
నీ నరాలు ఎక్కడ తెగిపోయి
నీకు హాని జరుగుతుందేమోనని
అదే రా పిచ్చి తల్లి మనసు...

**వజ్జల రమాదేవి**, 90322 24588



తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం – కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు
-బెల్లంకొండ సంపత్ కుమార్

-సంపాదకులు

## పోలాలకు ఇప్పుడు అమాసే!

ఏవీ ! పశు సంపదలు
కొట్టం కిక్కిరిసిగా !!.
కబేలాకు తరలి పోతున్న
మూగ పశువుల అరణ్య
"అంబా అంబా" మృత్యురోదనలు !.
స్వచ్ఛమైన చిక్కటి పాలేవి ?
పాలు రసాయమై ప్యాకెట్ పాలే
మనమంతా అనారోగ్యం పాలే!.
పోలాల భూములేవి?
ప్లాట్లు ప్లాట్లుగా
మెదలు ఎత్తి చూసే మేడలే!!.
ఒకప్పుడు పోలాల అమాసంటే
ఎద్దులు ఊరేగింపుగా మేళ కదా !
ఇప్పుడు పోలాలకే అమాస
మన భవిష్యత్తూ అమాసే!.

**కందాళై రాఘవాచార్య**
8790593638

## సెప్టెంబర్ - 17.

విలీనం విమోచనం సమైక్య దినం
వికటకవి - అర్థం ఒకటే నండి
వింత రాజకీయం చుట్టు తిరగకండి
విసుకుంటున్నారు ప్రజలని తెలుసుకొండి!.
చెట్టు ముందా విత్తు ముందా ,
కోడి ముందా గుడ్డు ముందా
తర్కం ఎందుకు!
విలవిల కొట్టుకుంటున్న చేప కు
స్వేచ్ఛా జలాలలో విహరిస్తున్నట్లు లేదా!.
తెలంగాణ సెప్టెంబర్ -17 కథ
తనుపట్టిన మూడు కాళ్ళ కుందేలైంది
పోరాడి తెచ్చుకున్న తెలంగాణను
ఆరాటపడి నిలపాలి అగ్రస్థానాన
ఎవరి అర్థం వారు చెబుతుంటే
అసలు అర్థం వ్యర్థం అవుతుంది
మూడు కాళ్ళు మీరు పట్టుకుంటే
నిజం కుందేలు కుంటిదైపోతుంది !.
జెండాలు అజెండాలు పక్కన పెట్టండి
సెప్టెంబర్-17 మూడు అర్థాలకథ ఇకనైనా
సశేషం... నుండి సమాప్తం చేయండి !.
మూడు కోతుల కథ నీతి
చెడు అనకు,కనకు,వినకు
శాంతి సహకార సౌభ్రాతృత్వం తో
సమాజాభివృద్ధికి కృషి చేయు!.
తికమక పేర్లతో తికమక చేయకండి
అందరు కలిసి జాతీయ జెండాక్రింద
అమరులకు అందరూ నివాళులర్పిస్తే
తెలంగాణ ప్రజలు హర్షిస్తారు!
(సెప్టెంబర్ -17, సందర్భంగా)

**-పట్లోళ్ళ బక్కారెడ్డి**
9705315250

## ఉప్మోత్సవము!

పొద్దంతా అలసిన దేహము
రాత్రి విరామయాత్రకుసుత వీడ్కోలంటది
పరగడుపులో ఆకలే ఉరుకుతున్న పి.టీ ఉష
ప్రపంచంలో అనేక భాషలున్నా
ఆశాజీవులకు ఆకలే అసలుసిసలు భాష
మానవుని ఖాళీ కడుపు రాజ్యానికి
చచ్చేదాకా శాశ్వత రాజు ఆకలే బహుశా
కాయమెంతదైనా కరిగే కాలమేదైనా
చెట్టంత ఎదిగే మనిషికి
ఆహారమే ఆయువుపట్టు.
తీరొక్కతీరు టిఫిన్ లు
రుచి చూసే భోజన ప్రియులకు
ఉప్మా మీద రవ్వంత ప్రేమే
ఉప్మాపాకము అల్కటి విద్యే
జిలకరా,ఆవ గింజలు
ఎండుమిర్చి,తరిగిన ఎర్రుల్లిపాయలు
కమ్మని వాసనల కళ్యామాకు రిమ్మలు
పోపుదినుసుల పొహలింపుల
పొయ్యి మీది నూనెమూకుడుకు
మూకుమ్మిడిగా వేడెత్తిన
సన్నని మంటలనాగుల
నాట్యాల తాళింపులో
శనిగ ,మినుప్పప్పుల మోహరింపుల
వేరుశనిగ,జీడిపప్పుల వేయింపుల
స్టీలుగంటె గిటారు వాయింపుల్లో
ఘుమ ఘుమల సరిగమల్లో
సన్న రవ్వ సత్తుగంజు గొంతెత్తిన
కుతకుతల పాటకు
ఆవిరి వాయువుల
అలల అలవోక ఆటకు
పొయ్యిమీద
సెగలపొగలు కక్కుతూ ఉడుకుతున్న
ఉప్పిండి ఉషోదయ అందమే ఆనందము
మాగాయో,మరి టమాటా పచ్చడో
మనిషిని క్షణక్షణం కలవరపెడ్తున్న
నిరాశానిస్పృహలు నివురుగప్పునట్టు
చింత తొక్కో,చిక్కటి పెరుగో జతకలిశాక
రుచి తెలిశాక మనసు లొట్టలేస్తుంది
వేడి వేడి ఉప్మా గుటుక్కుమంటే
అణువణువూ శక్తినిండి
శరీరమంతా ఉరిమే ఉప్మా ఉత్సాహమే
అమ్మ చేసే ఉప్మా ఆహా అమృతమే!
ఆలి చేసే ఉప్మా మహాద్భుతము!!
దేహ పుష్టి దేశ వృద్ధికి
మూలమిా ఉప్మా
మనుషులకు ఉగ్గులాంటి ఉప్మాతో
అజీర్తి అపకీర్తి నీడల
అవకాశములేని ఉప్మోత్సవమే!
పేదా ధనిక తేడాలేని
ఉప్మా లోకోపాహారమే !!
భారతీయులు ఉప్మా స్వాహా మానవులే కాదు
ఆకాశముతాకే
ప్మా స్వాభిమాన మహానుభావులు కూడా.

**-రమేశ్ నల్లగొండ**
8309452179

సెప్టెంబర్ 18 తంగిరాల చక్రవర్తి జయంతి

# సామాజిక ఉద్యమ రచయిత తంగిరాల చక్రవర్తి



అభ్యుదయ భావాలు కలిగి సమాజ హితానికి అంకితమైన ఒక సామాన్య వ్యక్తి తంగిరాల చక్రవర్తి. నేటి సమాజానికి అత్యవసరమైన అంశాలను వారు తన రచనలలో ప్రతిబింబింపచేస్తారు. స ంటే ఎవరు.. మానవాళి సముదాయమే కదా! అనునిత్యం జరిగే అసాంఘిక కార్యక లాపాలు, అఘా యిత్యాలు, దౌర్జన్యకరమైన, హింసాత్మకమైన సంఘటనలు, అకృత్య–అరాచక –అక్రమాల పరంపర, లైంగిక వేధింపుల వంటి అనాగరిక చర్యలను తంగి రాలవారు తమ కవితలద్వారా నిరసించటం అనేది చిరకాలంగా, వారు బతికున్నం తకాలం జరుగుతూ వుండేది. సాహితీస్రవంతి కానీ, తెలంగాణ సాహితీ కానీ నిర్వహించిన కవిసమ్మేళనాల్లో వారు చదివిన కవితలను విన్నవారికి ఇట్టే వారొక సామాజిక ఉద్యమ రచయిత అనే అభిప్రాయం ఏర్పడుతుంది. అనేక ఒడిదుడుకుల మధ్య తన జీవిత విధా నం కొంత ఆవేదనకి గురిచేస్తున్నా తలవంచక తన రచనల ద్వారా సమా జానికి ఏదో ఒక సందేశం ఇవ్వాలనే తాపత్రయం తంగిరాలవారి రచనల ద్వారా మనకి స్పష్టమవుతుంది.

2006వ సంవత్సరంలో అప్పటి కింకా నేను సమాచార పౌరసంబంధాల శాఖలో పి.ఆర్.వోగా పనిచేస్తు న్నాను. ఒక పత్రికలో ప్రపంచీకరణకు వ్యతిరేకంగా ఒక కవితాసంకలనాన్ని ప్రచురిస్తున్నట్లుగా ప్రకటనను చూసి వారిచ్చిన చిరునామాకు 'కరచాలనం' అనే కవితను పంపాను. సాహితీ స్రవంతిద్వారా ప్రచురించబడిన 'కలాలు–గళాలు' అనే ఆ కవితా సంకలనానికి తెలకపల్లి రవి సంపాదకు లుగా, ఎ.సత్య భాస్కర్, తంగిరాల చక్ర వర్తి సంకలన కర్తలుగా వ్యవహ రించారు. ఆ పుస్తకం ఆవిష్కరణ సభలో నేను తొలిసారిగా తంగి రాల చక్రవర్తితో కరచాలనం కావించాను. ఆ పరిచయం స్నేహంగా మారి వారి జీవితం అంతమయ్యేదాకా కొనసా గుతూనే వుంది. ఆ పుస్తకం తంగిరాల, సత్యభాస్కర్‌లనే కాక మరెంతో మంది కవులతో నాకు పరిచయం ఏర్పడటానికి దోహదం చేసింది.

'కలాలు–గళాలు' కవితా సంకల నంలో తంగిరాల రాసిన 'ద్వితీయ స్వాతంత్ర్య సంగ్రామం' కవితలోని పంక్తులు.

**దేశమాత అమ్మతనం ముందు**
**స్వేచ్ఛామాత అమ్మకంతనం**
**ఓడిపోతుంది...**
**నిశ్శబ్ద ప్రగతిశీల బీజం విస్ఫోటమై**
**విశ్వాన్ని అరుణమయం గావిస్తుంది**

ఆయన ఆకాంక్షించినట్లు స్వేచ్ఛా యుత అమ్మకంతనం ఓడిపోకపోవచ్చు. విశ్వం అరుణమయం కాకపోవచ్చుకానీ తంగిరాల ఎంతటి అభ్యుదయాన్ని కోరుకునేవాడో అర్థమవుతుంది.

ఆ మరుసటి సంవత్సరం సాహితీ స్రవంతివారే ముదిగొండ భూపోరా టంపై ప్రచురించిన 'భూస్వరాలు' కవితా సంకలనంలో తంగిరాల చక్రవర్తి రాసిన 'జరూర్ కరేంగా' అనే కవితలోని పంక్తులు

**మూడు అడుగుల నేలకోరె వామ నుడు**
**ఆరడుగుల నేల కోరె ఆదిమానవుడు**
**భువి అంతా నాదే అన్నాడు ఆధునికుడు**
**అనేవి నేడు అక్షరాలా సత్య మని** చెప్ప టానికి... సంకోచించవలసిన అవసరం లేదు. అటువంటి కవితాసంకల నాలెన్నిటినో ప్రచురించిన 'సాహితీస్రవంతి', తెలుగు సాహిత్యంలో ఎప్పు డూ ప్రగతి శక్తులదే అగ్రస్థానమని రుజు వు చేసింది. సర్వకళల సమన్వితుడుగా పేరొందిన తంగిరాల చక్రవర్తి విజయవాడ దగ్గర ఉన్న కపిలేశ్వరపురంలో సెప్టెంబరు 18, 1964వ తేదీన జన్మిం చారు. తండ్రి నాటకరంగ ప్రముఖులు తంగిరాల వెంకట శివరామకృష్ణ ప్రసాద్. చక్ర వర్తి ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి ఎం.ఎ. చేశారు. వారు నవతెలంగాణ దినపత్రికలో పని చేశారు. తెలుగు సాహి త్యంలో కథ, కవిత, నాటకం, వ్యాసం, నవల, గ్రంథసమీక్ష, విమర్శ మొదలైన ప్రక్రియలలో 3 దశాబ్దాలపాటు కృషి చేశారు. తండ్రి పేరు మీద తంగిరాల మెమోరియల్ ట్రస్ట్ ప్రారంభించి ప్రతి ఏటా ఒక నాటకరంగ ప్రముఖుడిని సత్కరిస్తూ వస్తున్నారు. ఇతని కృషిని గుర్తించి అనేక సాహిత్యసాంస్కృతిక సంస్థలు సత్కరించాయి. అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళన్(భోపాల్) జీవిత సభ్యుడిగా, తెలంగాణ సాహి తి రాష్ట్ర కమిటీలో సభ్యుడిగా ఉండేవారు. క్రీడాకా రునిగా కూడా జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీలలో ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ మొదలైన క్రీడల్లో పాల్గొని బహు మతులు, ప్రశంసాపత్రాలు పొందారు.

తంగిరాల చక్ర వర్తికి పుస్తక సమీక్షలు రాయటంలో ఒక ప్రత్యే మైన శైలివుంది. వివిధ పత్రికలలో మొత్తం 500 దాకా పుస్తకాల సమీక్షలు కావించారు. నేటిని జానికి దాదాపుగా 100దాకా సమీక్షలు రాసినట్లు ఆ పత్రిక ఎడిటర్ బైసదేవదాసు తెలియజేశారు. సాహితీకిరణంలో సమీక్షలు ప్రారంభించినప్పటి నుండి వారు మరణించేదాకా వారి పుస్తకసమీక్ష లేని సంచిక లేదని చెప్పవచ్చు. సాహితీకిరణం మాసపత్రికకు ఎంతోమంది ప్రముఖులను ఇంటర్వ్యూ చేశారు. సాహితీకిరణం ఇతర సంస్థలతో నిర్వహించిన కథలపోటీలల్లో అనేక సందర్భాలలో న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. సాహితీకిరణం సౌజన్యంతో జన్నాభట్ల నరసింహ ప్రసాద్ వారి తండ్రి గారు జన్నాభట్ల నరసింహ శాస్త్రి స్మారక సాహిత్యపురస్కారాన్ని తంగిరాల చక్రవర్తి అందుకున్నారు.

రంగస్థలం అంటే వారికి అమితమైన అభిమానం ఉండేది. ప్రపంచ రంగస్థల తీరుతెన్నులను వారు పరిశోధించి, సాహితీకిరణం పత్రికలో మూడు సంవత్సరాలపాటు వ్యాసాలురచించి, పాఠకులనుంచి ప్రశంసలను అందుకు న్నారు. వారి తండ్రిగారి పేరిట ప్రతి ఏటా ఇచ్చే అవార్డులు అందుకున్నవారిలో బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి, అయ్యదేవర పురుషోత్తమరావు వంటి నాటక రంగ ప్రముఖులే కాక, శోభానాయుడు వంటి నృత్య కళాకారిణులు కూడా ఉన్నారు.

తంగిరాల కృష్ణప్రసాద్ గారి 25వ వర్ధంతి, 90వ జయంతి, తంగిరాల చక్రవర్తి షష్టిపూర్తి, తంగిరాల ట్రస్ట్ రజ తోత్సవం సందర్భంగా పుర స్కారాలు పొందినవారిలో శ్రీయుతులు డా॥ జీవీ పూర్ణచంద్, పర శురామయ్య , నవులూరి రమేష్‌బాబు, దాసరి ఆళ్వారు స్వామి, వై .అవనిగడ్డ పున్నారావు, బోయిన వెంకటేశ్వరరావు, డా॥డి. శమం తకమణి, పొత్తూరి సుబ్బారావు, టి.వి. చంద్రశేఖర్, డా॥కోన వీరబ్రహ్మం, డా॥కె. పూర్ణచంద్రరావు, బి. ఆంజనేయ రాజు,వి. ఎస్ బోను, వి. వట్ఠాభి రామ కోటేశ్వరరావు,కె గణేష్‌కు మార్, జి.వి.రంగా రెడ్డి, కె గోపాలకృష్ణ, కె.శా ంతారావు,కె. ప్రభాకర రావు, యం. బాలగం గాధరయ్య ఉన్నారు.

విమర్శకుడిగా పేరొందిన చక్రవర్తి చుక్కల సాహిత్య ప్రక్రియపై విశ్లేషణ గ్రంథం, మరో రావణుడు గ్రంథాలు వీరి రచనా పటిమకు తార్కాణాలు.

మదర్ థెరిస్సా పబ్లికేషన్స్ వారికి తెలుగు భారతి,అక్షరమాల కూర్పు, అలైడ్ పబ్లిషర్స్ ఒకటి నుండి పదవతరగతివరకు తెలుగు రచన,అభ్యాస పుస్తక రచనకు సంపాద కత్వం,3,4,5 తరగతుల వారికి ప్రభుత్వ అభ్యాస పుస్తకాలకు సంపాదకత్వం వహించారు.

కమనీయం–నా గుండెల సవ్వడి, ఆకాంక్ష,విసురు ( రెక్కలు )ప్రతీక్ష,అక్షర భారతి,కలాలు గళాలు సంకలనాలు కాగా స్వర్ణ భారతి,హృదయేశ్వరి గ్రంథాలు వైద్య సంబంధ గ్రంథాలతో సమాజానికి దగ్గరైన తంగిరాల– మధుమేహం,గుండెనెప్పి జాగ్రత్తలు, ఆయుర్వేదామృతం, వంటింటి వైద్య చిట్కాలు, అందరికీ ఆయుర్వేదం అసమాన రచనలు, నాటక రచనలో విచ్ఛితి, మిరాసి, గాలిబ్రతుకులు,వెూనోగామి, దర్శకుడు ధర్మయ్య, అసతోమా సద్గమయా, చీడపురుగులు రచయితగా విభిన్న రచనల్లో ప్రావీణ్యాలు అయిన వీరు నటుడు నరసింహ సీరియల్ కూడా రాశారు. నాటక దర్శకునిగా కుందేటి కొమ్ము, కొక్కొరొకో, గోగ్రహణంలలో భేష్ అనిపించుకుని ఆకాశవాణి ఆర్టిస్టుగా మన ఆకాశవాణిలో తన సాహితీ ప్రక్రియలు వినిపించి, లండన్ రేడియోలో ప్రసంగాలు సైతం చేశారు తంగిరాల చక్రవర్తి.గుండెనెప్పి జాగ్రత్తలు అనే పుస్తకాన్ని రచించి తద్వారా ప్రజలను జాగృత పరిచిన తంగిరాల చక్రవర్తి గుండెపోటు వలన ఆకస్మికంగా గత సంవత్సరం 2025 ఆగస్టు 16న మర ణించడం దురదృష్టకరం. వారు మరణించి నప్పటికీకూడా వారి సాహిత్యం పలకరిస్తూనే వుంటుంది. వారు చేసిన సామాజిక, సాహిత్య సేవలను ఎవరూ మరచిపోలేరు.



**-పొత్తూరి సుబ్బారావు**
సెల్:9490751681

# తాళ్లపాక అన్నమయ్య 'ఏకలవ్య శిష్యుడికి' అక్షర నివాళి



ద్రోణాచార్యుడిని గురువుగా భావించి, ఆయన పరోక్షంలోనే ధనుర్విద్యను అభ్యసించి చరిత్ర పుటల్లో నిలిచిపోయాడు ఏకలవ్యుడు. అదే మార్గంలో నడచిన తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్ 14వ శతాబ్దానికి చెందిన పదకవితా పితామహుడు శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల సంకీర్తనలను చదివి చదివి పరవశించి, ముందుగా ఉత్తమ పాఠకుడయ్యారు. అటు తర్వాత ఏకలవ్య శిష్యత్వాన్ని పొందారు. ఆ విధంగా అన్నమయ్యనే తన గురువుగా ప్రతిష్ఠించుకున్న ఆధునిక సంకీర్తనాకారుడు తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్.

వీరు నిజామాబాద్ జిల్లా జానకంపేట ప్రాంతానికి చెందిన సంకీర్తనాకారుడు. విద్యుత్ శాఖలో సాధారణ ఉద్యోగం చేస్తూనే సంకీర్తన సాహిత్యంలో అసాధారణమయిన సాధన సాగించి, జూలై 29, 2026న పరమపదించారు.

1939 లో జన్మించిన తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్ బాల్యం–పేదరికం, తీవ్ర ఆర్థిక ఇబ్బందుల నడుమ సాగింది. ఆ రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో చదువుకోవడానికి సరయిన పాఠశాలలు గానీ, రవాణా సౌకర్యాలు గానీ లేని క్లిష్ట పరిస్థితులు. అయినప్పటికీ, విద్యపై ఉన్న ఆరాటం, చదువుకోవాలనే బలమయిన సంకల్పంతో ఆయన వెనకడుగు వేయలేదు. బంధువుల ఇళ్లల్లో ఉంటూ అనేక కష్టనష్టాలను ఓర్చి తన విద్యను విజయవంతంగా పూర్తి చేయడమే కాకుండా, విద్యుత్ శాఖలో ఉద్యోగాన్ని సాధించడం వారి స్వశక్తికి నిదర్శనం.



తాళ్లపాక అన్నమయ్య నామంలోని 'తాళ్ల' అనే పదానికి, తన ఇంటిపేరులోని 'తాళ్ళఅనే పదానికి ఉన్న అపూర్వ పోలికను ఆయన ఒక సంకేతంగా భావించారు. అన్నమా చార్యుల వారికి తాను ఏకలవ్య శిష్యుడుగా భావించుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలని సంకల్పించుకుని ఆధ్యాత్మిక ప్రయాణాన్ని ప్రారంభించారు.

తన ఉద్యోగ బాధ్యతలను నెరవేరుస్తూనే, దొరికిన విశ్రాంతి సమయాన్ని గ్రంథాలయాలకి పరిమితం చేసారు. వరుసగా ఎనిమిది సంవత్సరాల పాటు తాళ్లపాక అన్నమయ్య, క్షేత్రయ్యల సంకీర్తనలను లోతుగా చదివి, వాటిలోని భావజాలాన్ని, రాగ–తాళ రీతులను సంపూర్ణంగా ఆకళింపు చేసుకున్నారు.

**అన్నమయ్య నీ కీర్తనలు ఆత్మలో నిలిపి**
**కన్నయ్యకై అనుదినము నే పదాలతో**
**పొన్నపూదండలు మెండుగా అల్లి అల్లి**
**కన్నతండ్రి కృష్ణయ్యకు అంకిత మిచ్చి నే కన్నుమూతు**
**క్షేత్రయ్య నీపాద పద్మములు దలుతు సాహితీ**
**క్షేత్రమున సంపెంగలు పూయించి పుణ్య**
క్షేత్రములకు అవి పుష్పమాలలవ్వ కురు
క్షేత్రపు కృష్ణుని వలె బోధించు

అంటూ ఏకలవ్య శిష్యత్వంతో ఇరువురు గురువులకు పాదాభివందనం చేసారు.

అన్నమయ్య వలెనే తాను కూడా 32,000 సంకీర్తనలు రచించాలనే బృహత్తర సంకల్పాన్ని నిర్దేశించుకున్నారు. నిరంతర సాహిత్య సాధనతో, దైవచింతనతో తన జీవిత కాలాన్ని కృష్ణార్పణం చేస్తూ వేల సంకీర్తనలను రాసారు.

ఈ క్రమంలోనే వారి సంకీర్తన సాహిత్యంపై "తాళ్ల లక్ష్మీనారాయణ గౌడ్ సంకీర్తన సాహిత్యం – పరిశీలన" అనే అంశంపై తెలంగాణ విశ్వవిద్యాలయంలో పరిశోధన జరుగుతుంది.ఆయన రచించిన సంకీర్తనలలో 7014 సంకీర్తనలు 19సంపుటాలుగా ముద్రిత మయినాయి. ఇంకా చాలా సంకీర్తనలు రాతప్రతులుగా ఉన్నాయి.

సాహిత్య రీతి విషయానికి వస్తే, అన్నమయ్య వేంకటేశ్వర స్వామిని నాయకుడిగా భావించినట్లే, తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్ శ్రీకృష్ణుడిని తన నాయకుడిగా భావించి తానొక గోపికగా, కాళిందిగా, మీరాబాయిగా మారి ఆత్మ నివేదన చేసుకుంటూ, అష్టవిధ శృంగార నాయిక లక్షణాలను తన భావాల్లో నింపుకుని మధుర భక్తిని పండించారు.

తన లక్ష్యాన్ని నెరవేర్చుకోవాలనే తపనతో ఉన్నప్పటికీ, ఆ అమూల్యమయిన సాహిత్య నిధిలో అత్యధిక భాగం ఇంకా రాతప్రతుల రూపంలోనే మిగిలాయి.

తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్ సంకీర్తనల్లో వస్తువు శృంగారం. వారి రచనలలో భగవంతుని రూపాన్ని, గుణగణాలను ఉపమానాలతో రమణీయంగా వర్ణించారు. సహస్రనామాలు తన సంకీర్తనలలో పదే పదే స్మరిస్తూ, పరమాత్మ నామస్మరణను సంకీర్తన సాహిత్య ప్రవాహంగా మలిచారు. తనను తాను శృంగార నాయికగా మార్చుకున్నారు. శ్రీకృష్ణుడిని నాయికకు అనుకులుడయిన దక్షిణ నాయకుడిగా భావించి ఆత్మనివేదన చేసుకున్న వారి మధుర భక్తి విధానం అన్నమయ్య తర్వాత చెప్పుకోదగింది.

ఇటువంటి భావసంపదతో, మధుర భక్తి, శృంగార రసజ్ఞతతో సాగిన 'తాళ్ళ లక్ష్మీనారాయణ గౌడ్' గారు సంకీర్తనల రూపంలో సాహిత్య లోకంలో చిరంజీవిగా నిలిచిపోతారు. భౌతికంగా వారు నిష్క్రమించినా, వారు విడిచివెళ్లిన సంకీర్తనల రూపంలో పాఠకుడి హృదయాలలో శాశ్వతంగా నిలిచిపోయారు.



**-కొలుకుల రజిత**
7569856191

# పంచభూత తత్త్వ ప్రదీప్తి
# ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ గారి కావ్యం 'పంచవటి'

అమెరికాలో "సత్య"గా ప్రసిద్ధులైన ప్రొ॥ అప్పాజోస్యుల సత్యనారాయణ గణితశాస్త్రంలోనూ, కంప్యూటర్ సైన్స్‌లోనూ నిష్ణాతులు. గ్రాఫ్ థియరీ, అల్‌గొరిథమ్స్, నెట్‌వర్క్ రిలయబిలిటీలలో ఆయన ప్రామాణికమనదగిన పరిశోధనలు చేశారు. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్ వంటి పేరొందిన విశ్వవిద్యాలయాలలో, స్టీవెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (న్యూజెర్సీ)లోని కంప్యూటర్ సైన్స్ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా పనిచేశారు. "సత్య" నెట్‌వర్క్ రిలయబిలిటీ పరిశోధన అమెరికాలో ఒక పెద్ద సంచలనం. స్టీవెన్స్‌లో ఆయన ప్రతిష్ఠాత్మకమైన అవార్డులెన్నో అందుకున్నారు. జెస్ డేవిడ్స్ రిసెర్చ్ అవార్డు, అలెగ్జాండర్ హంఫ్రీ డిస్టింగ్విష్డ్ టీచింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ అవార్డు, హెన్రీ మోర్టన్ డిస్టింగ్విష్డ్ ప్రొఫెసర్ టీచింగ్ అవార్డు ... ఇవన్నీ ఆయన అందుకున్న అవార్డులలో కొన్ని.

విద్వత్కవిగా ఆచార్యులవారు పంచభూతతత్త్వం ఆధారంగా - సాంప్రదాయిక, ఆధునిక వైజ్ఞానికాంశాల మేళవింపుతో - ఐదు తారావళుల్ని విరచించి ప్రచురించారు.

అవి–'పావకవృత్త తారావళి, 2. సుజల వృత్త తారావళి 3. వసుంధరా వృత్త తారావళి. 4. అంతరిక్ష వృత్త తారావళి, 5. సమీర వృత్త తారావళి. ఈ ఐదు తారావళుల ఏకసంపుటిగా వచ్చింది 'పంచవటి'.

తారావళి తెలుగు సాహిత్యంలో అంతగా ప్రాచుర్యంలో లేని పద్యప్రక్రియ. దీనిలో 27 పద్యాలూ 27 నక్షత్రాలు! చివర ఒక అంకితపద్యం వుంటుంది.

**'పావకవృత్త తారావళి'**

అగ్ని స్వరూప స్వభావాల ఆవిష్కరణ. 'అగ్నిమీళేపురోహితమ్' అన్న 'ఋగ్వేద ప్రథమోక్త సూక్త మహితు'ని ఆరాధన. అగ్ని అంతరంగ తత్త్వం, దాని చిత్రణ. ఇది జగత్ చైతన్యానికి ఆధారభూతమైన ప్రాధాన్యం ప్రశంస - ప్రతిపద్యంలో రసోదంచితంగా జాలువారింది.

త్రేతాగ్ని స్వరూపుడంటే - ఆహవనీయ, గార్హపత్య, దక్షిణాగ్నుల తేజం. అలాగే, అగ్నిసంబంధీకుడు సూర్యుని సర్వాంతర్యామి తత్త్వాన్ని కూడా ఈ 'త్రేతాగ్ని' తత్త్వానికి అనుసంధానిస్తూ సూర్యుని ఉదయ, మధ్యాహ్న, అస్తమయ స్థితుల్నీ ప్రస్తావించారు - ఈ తారావళికి తమ 'మిత్రవ్యాఖ్య' గ్రంథాన్ని వ్రాసిన డా॥నాగ రాజ్యలక్ష్మిగారు. ఆచార్యులవారి కవిత్వమంతా ప్రౌఢసమాస భరితమైన, కవితామయమైన అగ్నితేజస్సంతా చదువరిని అంతర్ముఖీనుని చేసేస్తుంది. కవిత్వం స్ఫూర్తిమంతం కావాలంటే, కవి గుండెలోనూ ఆ 'కీల' మండుతూ వుండాల్సిందే. అప్పుడే కావ్య శిల్పనిర్మాణ కౌశలం పదవాక్య గాంభీర్యంలో వెలుగుల్ని కురిపిస్తుంది. ఆచార్యులవారి చిత్త 'శుచి' వలన కావ్యంలో వారి శాస్త్రదృష్టీ, లోకదృష్టీ కూడా స్పష్టంగా వెల్లడైనాయి.

సంబోధనలో 'మహాకాలాగ్ని భట్టారకా' అన్నారు అగ్నిని. ఇది 'కాలనిర్ణేత సూర్యభగవానుని ప్రేరకుడు అగ్ని అని స్తుతించడం కన్పిస్తుంది.






పుస్తక సమీక్ష

## సుజల వృత్త తారావళి

జలం అంటేనే జీవనం. మానవ జీవనానికి ఆధారాలైన పంచభూతాల్లో విశేష ప్రాధాన్యం కలిగినది జలం. అందునా - ఆచార్యులవారి తారావళి మకుటం - 'సు' జలవృత్తం! కనుక, ఆ తత్త్వవిచారమంతా వారి సహజ పాండిత్యోద్భవమైన ప్రౌఢశైలిలో సాక్షాత్కరించింది.

**'జలసంశోభిత తీరభూముల మహాసామ్రాజ్యముల్ లెస్సగా**
**విలసిల్లెన్, తెగటారె, వర్తక బృహద్విద్యావివృద్ధుల్ ప్రవ**
**ర్తిలె పుణ్యాలయ సిద్ధ సంస్కృతులు సుద్దీపించె మాకెల్ల నీ**
**యలఘుశ్రీ జలవాహినుల్ వసుధ దివ్యారామముల్ నిర్ఝరీ!'**

అంటూ కొనియాడారు. పద్యం చదవగానే– నైలునదీ నాగరికత, సింధునదీ నాగరికతలు పఠిత మేధను పునర్వీక్షణలో పడేస్తాయి. సుజల ప్రాభవాన్ని మౌలిక తత్త్వ విచారంతోనూ, శాస్త్ర విజ్ఞాన పురోగతితోనూ అనుసంధానిస్తూ - కవి అనేక 'జీవన' సౌభాగ్యాల్ని ప్రస్తావిస్తూ ఈ కావ్యోన్నతిని అద్రిసదృశం చేశారు.

## వసుంధరావృత్త తారావళి

ఈ కావ్య ప్రారంభ పద్యంలోనే భూమి ప్రాధాన్యానికీ, ఘనతకూ కైమోడుస్తూ, కవి – 'సర్వోత్కృష్ట జని ప్రపూరితము...' అన్నారు. అంటే సర్వశ్రేష్ఠమైన పుట్టుకలచే నిండివున్నది - అని. ఈ పుట్టుకల్లో మానవులూ, జంతువులూ, పక్షులూ, క్రిమికీటకాదులే కాక, చెట్టుపుట్టలూ, కొండలూ బండలూ, నదీనదాలూ అన్నీ ఉన్నాయి. అంతేగాక, భూమిలోపల ఖనిజాలూ ఖనులూ... ఇలా ఎన్నెన్నో.. అందుకనే, 'బహుధా సంపూర్ణతా ధామమున్' అనేశారు కవి. ఆ విశేష పుట్టుకల వివరాలన్నీ వరుసగా ఒక్కొక్క పద్యంలో వర్ణింపబడినాయి.

**'మనుజుల్ మూర్ఖులు భూగ్రహంబు తమ సామ్రాజ్యంబుగా నెంచుచున్**
**వనరుల్ సర్వము స్వార్థలబ్ధికయి విధ్వంసంబు గావించి జీ**
**వ నిరాధారగ భూమి కెగ్గొసగు నవ్వారిన్ నిరోధింప దు**
**ర్జన శిక్షాస్మృతి నేర్పరించవలె సర్వప్రాణి సంరక్షకై'**

ఈనాటి మానవులకు అత్యుత్తమమైన, అత్యంతావశ్యకమైన భూమి క్షేమం గురించి ఇంతా –అంతా – చెప్పి అంకితపద్యంలో **"వివిధ భాషల నెందరో విస్తరించి / చెప్పిరీ వసుంధర తేవ నొప్పుమీర/ నేనెరింగిన నా తల్లినేల ఘనత/ పొందుపరచితి కొంత ఈ పొత్తమందు"** అని కవి తమ వినయస్వాంతాన్ని మన ముందుంచారు. ఆచార్య అప్పాజోస్యులవారు నిజానికి కవిత్వ, పాండిత్య పారదృశ్యులు. అయినా, పద్యరచనా విధానంలో కనిపించే 'ఘనాఘన' ప్రౌఢివేరు, వ్యక్తిత్వ దీధితిలోని నిరాడంబరత వేరు. అదే వారి అంతఃకరణ శుద్ధి ప్రత్యేకత.

## అంతరిక్షవృత్త తారావళి

అంతరిక్షం అనంతం కదా. ఆ అనంతతత్త్వాన్ని ప్రతిపద్యంలోనూ ఆలోచనీయంగా, రమణీయ కవిత్వశైలిలో విశదీకరించారు కవి. కావ్యా రంభమే ఒక ఉదాత్త రమణీయమైన భావ సౌందర్యంతో, నూత్న విశేషణ వైభవంతో అలరారుతోంది. అంతరిక్షం 'శ్రీకాశప్రదం', 'సర్వతోముఖ హవ క్రీడాభిరామం' 'బృహత్ బ్రహ్మాండ సంయుక్తం' 'విమలాత్మకం'. అంతేకాదు.

కావ్యమంతా వస్తుక్రమోన్మీలన శిల్పంతో అలరా రుతోంది. అప్పాజోస్యుల వారు పద్యవిద్యావిరించి కనుక, వారి కవిత్వ స్పర్శ ప్రతి అక్షరాన్నీ వర్ణశోభితం చేసింది. అంతేగాక – ప్రతి పద్యంలోనూ వైజ్ఞానికాం శాలూ, ఆధునిక సాంకేతిక విశేషాలూ – గంభీరంగా, నిబిడంగా ప్రయుక్తమై, కవిజ్ఞాన శేవధి పట్ల ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి.

పురాణాల్లో ప్రాచుర్యమైన సూర్యచంద్ర గ్రహణస్థితినీ, ఇటు ఖగోళవిజ్ఞాన ప్రామాణిక సూత్రాలననుసరించి అవి ఏర్పడే తీరుని గురించీ వివరించాయి ఈ పద్యాలు.

అంతరిక్ష వృత్త తారావళిలో అతివిస్తరమూ, అనూనావృతము, అగణ్యమూ అయిన గగనం నైరూప్య చిత్రణనూ, మనకు అక్షిగోచరమవుతున్న సకల భౌతిక విశేషాల్నీ - కవితామయంగా ఆవిష్కరించారు కవి. భానుగ్రహకూటమి, నక్షత్ర సంబంధ బాంధవ్యాలు, చలన గమన పయన రీతులూ ... వంటి ఎన్నో వైజ్ఞానికాంశాల్ని అర్థస్ఫూర్తి సాంద్రతతో చెప్పారు కవి.

## సమీరవృత్త తారావళి :

భూమిపై నివసించే ప్రాణికి అత్యంతాగత్యమై, సర్వత్రావ్యాప్తమై, వర్షాలకు మొదలూ తుదీ అయిన వాయువు ప్రాధాన్యాన్ని ప్రౌఢంగా వర్ణించారు కవి. ఆ తర్వాతి పద్యాల్లో వరుసగా – సమీరగుణతతినీ, జగత్ప్రాణుని తత్త్వాన్నీ క్రమవికాస విధానంలో దృశ్యీకరించారు. వీటిలో వాయుపీడనం, వాతావరణ ప్రభావంలో సమీరుని ప్రాధాన్యం అగ్నిమైత్రి వంటి అనేక సాంకేతికాంశాలు వచ్చాయి. చివరికి 'వసుధ సౌభాగ్య ప్రదాత్రుడు'గా 'జీవశ్రీకరుడు'గా విశ్వచేతనకు అసలైన 'ధీరోదాత్త సత్త్వ' స్వరూపుడుగా వాయువుని కవితామయుని చేశారు ఆచార్యులవారు.

స్పష్టమైన రీతిలో పద్యాన్ని రసవంతంగా అందిస్తూ ఈ నాటి సాహిత్య పిపాసుల ఆర్తిని తీర్చేలా రూపుదిద్దుకున్న 'పంచవటి' అనే పంచభూతతత్త్వ దీపిక సాంకేతిక, వైజ్ఞానిక అంశాలతో కూడి ఉండటం చేత యువతకు అభిమాన కావ్య మవుతుతుందనటం అతిశయోక్తి కాదు.

తెలుగు సాహితీ యవనికపైన ప్రభవిస్తున్న పద్య సాహితీ భాస్కరులకు ఈ పంచవటి తారావళి వృత్త పద్యరాజమై నిలుస్తుంది.



**–మట్టిగుంట వెంకటరమణ**
సెల్: 8374822255






## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

## 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు

అడ్మిన్: **రమాదేవి కులకర్ణి**
8985613123

నిర్వహణ: **–శ్రీమతి సత్య నీలిమ**
సెల్: 95021 56813



### నా ఊపిరి

తీయనైన భాషా
తేట తెలుగుల భాష
మట్టి పరిమళాలతో నిండిన యాస ఉన్న భాష,
నా తెలంగాణ భాష.
ప్రజాకవిగా బిరుదు పొంది
"తెలంగాణ తొలి పొద్దు కాళోజి"
అన్న బిరుదు
గాంచి పద్మభూషణ్ అవార్డు పొంది
'యాది' అనే గ్రంథాన్ని రచించిన
కాళోజీ భాషకు
ప్రాణం పోసిన
మహనీయుడు
వచ్చిండన్నా, అచ్చిండన్నా
వరాల భాష తెలుగు.
బిడ్డ మంచిగున్నావా
కాసింత బువ్వ తిని పో
అనే పలుకులలోని
ఆప్యాయత ఎదను
కదిలించే మధురమైన సన్నివేశాలు.
తెలంగాణ పల్లె ప్రజల
జాన పదాలలో పురుడు పోసుకున్న భాష.
బతుకమ్మ పండుగలో
బంగారు బాటై పరవశిస్తూ,
బోనాల పండుగలో బోనం ఎత్తుకొని పాడే
పాటలు
జానపదాలకు పుట్టినిల్లు తెలంగాణ భాష
పలుకులలో అమృతం జాలు వారే.
మకరందాల తీయనైన భాష.
పొలాల్లో స్వేదాన్ని
చిందించే రైతు కష్టాలు
కదిలే ప్రతి ఊపిరిలో
పనే పాటై నిలిచిన
సందర్భాలు ఎన్నో.
పుట్టుక నీది చావు నీది
బతుకంతా దేశానిది అని
నినదించిన కాళోజీ
కలంలో జాలు వారిన
అద్భుతమైన కావ్యాలన్నింటిలోను
తెలంగాణ భాష
యాస ఉట్టిపడుతుంది.

**–రాచర్ల సులోచన**
హైదరాబాద్

### "వెలుగు భాష"

అమ్మ పలుకులలో అనురాగం
అవ్వ పలుకులలో అభిమానం
పల్లె పలుకులలో పారిజాతం
కలగలపిన ఆప్యాయతల అనురాగం
తీయని నా తెలంగాణా భాష
తల్లి ఒడిలో విన్న తొలి పలుకులా
మనసుకు హత్తుకునే మమకారంలా
వెన్నెల వెలుగుల నిండైన భాష
చెరువుగట్టున ఆత్మీయతలలో
తరువు నీడన కబుర్లలో
మనుజుల మృదు మధుర హాసంలో
పుణికి పుచ్చుకున్న సహజత్వంతో
నిండుగా వెలుగు భాష
జానపదాలు జోలపాటలలో బతుకమ్మ బోనాం
సందళ్లలో
నేల గుండె చప్పుళ్ళలో తాళం వేసే భాష
అలసిన మనసును ఓదార్చు యాస
అనుబంధాల కమ్మని పలకరింపుల పరవళ్ళు
పిలుపులో పుట్టెడు ప్రేమ మాటలో మమతల
తావి
మనసును మరులుగొలిపే మహత్తరమైన భాష.

**–సింగీతం విజయలక్ష్మి**

### ఆత్మీయ భాష

పల్లె పదాలతో ఆత్మీయతను పంచి,
అక్కున చేర్చుకునే ఆదరించే,
మనసైన భాషా మన తెలంగాణ యాస
వెక్కిరింతలు,కొక్కిరింతలకు
వెనకంజ వేయక
వ్యంగ్యాలను తొక్కి పట్టి
నికార్సైన మాటల మూటలతో
మది మదిని తట్టి లేపి
ఆత్మీయతను పంచే
అమ్మ భాష మన అరుదైన భాష.
మట్టి బంధాలతో మమతలను పంచుతూ
పరభాష పదాలను తనలో కలుపుకొని
ప్రసన్నంగా పలకరిస్తూ,
వేల సంవత్సరాల నుండి వేగుచుక్కగా వెలుగుతూ,
మసకబారకుండా నిలిచిన మనసైన, మధురభాష.
బడి పలుకుల భాష వద్దు
పలుకుబడుల భాష ముద్దని చెప్పిన
ప్రజా కవి కాళోజి జన్మదినోత్సవం
తెలంగాణ భాషా దినోత్సవం గా జరుపుకుంటున్న
తెలంగాణ ప్రజలందరికిది వసంతోత్సవం.

**–డా. బండారి సుజాత**
హనుమకొండ.

### నా భాష సౌందర్యం

తేనెలొలికే మాటల తీయదనం
తెలంగాణ భాషలోని సహజగుణం.
పల్లె పరిమళం వెదజల్లే పలుకులు
పలకరింపుతోనే పంచును ఆనందాలు.
మట్టి వాసనలు మోసుకొచ్చే ముచ్చట్లు
మనసును మురిపించే మధురమైన మాటలు.
బతుకమ్మ పాటల్లో తీయదనం
బేధ భావాలు చూపకుండా అందరిని కలిపే
ఓ ఆత్మీయ రాగం.
బోనాల వేడుకల్లో జనాలలో ఉత్సాహం
మురిసేను తెలంగాణ తల్లి హృదయం.
తెలంగాణ భాషలో దాగుంది జీవన సౌందర్యం
తల్లి ప్రేమ అంతటి స్వచ్ఛదనం.
జానపదలాతో జనాలలోకి జలపాతంగా దూకే
భాష
నేల తల్లి నేర్పిన గొప్ప భాష .
యాస అంటారు కొందరు
అది ఇక్కడి ప్రజల ఊపిరి.
మా మాటకు ఉన్నది చరిత్ర
కాలం మారిన ఎన్ని తరాలు మారిన
ఎప్పటికి మా గుండెల్లో నిలిచిపోయే భాష

**–అప్పె షర్మిల**

## తెలుగు పద్యానికి పూర్వపు వైభవం

తెలుగు భాషకు సొగసు, శోభ అందించిన ప్రధాన రూపం పద్యం. ప్రాచీన కాలం నుండి ఆధునిక యుగం వరకు తెలుగు పద్యం రూపాంతరం చెందుతూ, ప్రజల హృదయాలలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకుంది.

నన్నయ, తిక్కన, ఎర్రనల కవిత్రయం మహాభారతాన్ని తెలుగులోకి అనువదిం చడంతో పద్య కవిత్వానికి బలమైన పునాది పడింది. చంపూ కావ్యాల రూపంలో వృత్తాలు, జాతులు, ఉపజాతుల ఛంద స్సులతో పద్యం సుసంపన్నమైంది. శ్రీనాథుడి **'శృంగార నైషధం', బమ్మెర పోతన 'శ్రీమదాంధ్ర భాగవతం'** వంటి కావ్యాలు పద్య కవిత్వానికి రససిద్ధిని ఇచ్చాయి. విజయనగర సామ్రాజ్య కాలంలో శ్రీకృష్ణదేవరాయల పోషణలో ప్రబంధ యుగం వికసించింది. ఆయన రాసిన **'ఆముక్తమాల్యద', అల్లసాని పెద్దన 'మనుచరిత్ర', ధూర్జటి 'కాలహస్తి మహత్త్వము', తెనాలి రామకృష్ణుడి 'పాండురంగ మహాత్మ్యము'** అత్యున్నత అలంకారిక సౌందర్యాన్ని అందించాయి. వేమన ఆటవెలది పద్యాలు, బద్దెన సుమతీ శతకం సమాజ హితాన్ని ప్రబోధిస్తూ ప్రజాదరణ పొందాయి. పద్మకవి, చేమకూర వెంకటకవి వంటి మహనీయులు తమ కావ్యాలతో పద్య సాహిత్యానికి అపారమైన ప్రచారాన్ని కల్పించారు.

కాలక్రమంలో సమాజంలో వచ్చిన మార్పులతో కవిత్వ రూపాలు మారాయి. ఆధునిక కాలంలో గురజాడ ముత్యాల సరాలు, శ్రీశ్రీ 'మహాప్రస్థానం' ద్వారా వచన, గేయ కవిత్వాల జోరు పెరగడంతో పద్య రచన ప్రాభవం తగ్గింది.

క్లిష్టమైన ఛందస్సు, గ్రాంథిక వ్యాకరణ నిబంధనలు నేర్చుకోవడం కష్టమనే అభిప్రాయం యువతరంలో ఏర్పడటం, పాఠశాల విద్యలో పద్య పఠనానికి ప్రాధాన్యం తగ్గడం, ఆధునిక ప్రసార మాధ్యమాలు, సామాజిక మాధ్యమాల ప్రభావంతో మౌఖిక పద్య పఠన సంస్కృతి క్షీణించడం పద్యం తన ప్రభావాన్ని కోల్పోవడానికి ప్రధాన కారణాలు. దృశ్య మాధ్యమాల రాకతో పుస్తక పఠన అలవాటు కూడా బాగా తగ్గిపోయింది.

ప్రస్తుత కాలంలో తెలుగు పద్యం మళ్లీ తన ఉనికిని చాటుకుంటోంది. అవధాన ప్రక్రియలు, పద్య పఠన పోటీలు, సాహిత్య సభల ద్వారా పద్యానికి పునరుజ్జీవనం లభిస్తోంది.

అంతర్జాలంలో సామాజిక మాధ్యమ సమూహాలు పద్య ప్రేమికులను ఒకే వేదికపైకి తెస్తున్నాయి.

పద్య వైభవాన్ని పునరుద్ధరించడానికి మనవంతుగా పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు పద్య పఠనం, లయబద్ధ గానం నేర్పించాలి. సాంకేతికతను ఉపయోగిస్తూ యూట్యూబ్, పాడ్‌కాస్ట్‌ల ద్వారా సులభ శైలిలో పద్యాల భావాలను ప్రచారం చేయాలి. ప్రతి ఇంట్లోనూ పిల్లలకు చిన్నతనం నుంచే పద్యాలు నేర్పించే వాతావరణం కలగాలి. సంప్రదాయాన్ని రక్షిస్తూనే నవీన సామాజిక భావాలను పద్యంలో పొందుపరిచినప్పుడు తెలుగు పద్యానికి పూర్వ వైభవం సంపూర్ణంగా చేకూరుతుంది.



**–సి. హెచ్. ప్రతాప్**
77998 00773



ఫేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా॥ రావి రంగారావు వారం వారం సాహిత్యం వర్క్ షాపులు నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు.

"ఈ వారం వచన కవితల వర్క్ షాప్...అంశం... "శిష్యుడు". విజేతల కవితలు చదవండి.-సంపాదకులు

–డా॥రావి రంగారావు
9247581825

### పలు రకాలుగా శిష్యులు

ఏకాగ్రతనే అల్లుకుని ఎదుగుతూ
బింబ ప్రతిబింబ రీతిలో
ప్రతిఫలిస్తూ
గురు ధ్యాసే తమ శ్వాసగా చరించే
శిష్యులు కొందరు.
గురువే వనమాలి గా మారిన వేళ
మొక్కగా చెంత చేరి
వైఫల్యాల చీడ పీడలనుంచి
జ్ఞాన పంచగవ్యాలతో రక్షణ
పొందుతూ
దశదిశలా ఎదిగి కీర్తి
ఫలాలనే గురు దక్షిణగా అర్పించే శిష్యులు
కొందరు.
తమ లక్ష్యాల నావకు
గురువునే చుక్కాని గా నిలుపుకుని
గగనంలాటి గురువుకు
విధేయుడై హరివిల్లులా ప్రణమిల్లుతూ
సప్త వర్ణాలతో విరాజిల్లి
తరించే శిష్యులు కొందరు.
గూగుల్ తల్లి వాక్కే వేదవాక్కులా తలచి
గురు భాష్యాలకు వక్రమార్గాలు వెతుకుతూ
సంశయాల పొదిని మోస్తూ
అసమంజస బాణాలను
సంధిస్తూ
గురు ప్రాభవపు కోటను
బద్దలు కొట్టే
ఫిరంగుల్లాటి శిష్యులు కొందరు.
గురు సింహ బాటను అనుకరిస్తూ..నే
నడి మధ్యలో వక్రదారిలో పయనిస్తూ
గమ్యం చేర్చలేదంటూ
నిందల వలువలు కప్పుతూ
స్తుతించే శిష్యులు కొందరు.
పాదాల చెంత పద్మంలా చేరి
శిరస్సు పై ముళ్ళ కిరీటమై
పూసరవెల్లి లా ఏమార్చే
శిష్యులు కొందరు.
గురుజ్ఞాన నదీ ప్రవాహం లో
గులకరాయిలా చేరి
అలల శ్రమలకు తట్టుకుని
పరీక్షల వొరిపిడిలో అరిగి
సాలగ్రామమై వెలిగిపోవటమే ...
శిష్యుడంటే.....

**–మేడిశెట్టి సుభద్రా కృష్ణ**
7396959347

### శిష్యుడు...

దైవమే శిష్యుడై
యాగ రక్షణ కోసం
గురువు వెంట నడిచిన రాముడు!.
దూరం పెట్టిన గురువుకోసం
బొటనవేలునే ఇచ్చి
ఆకాశమంత ఎదిగిన
ఏకలవ్యుడు!.
జగద్గురువే శిష్యుడై
యముడినే ఎదిరించి
గురుపుత్రుని తిరిగి తెచ్చిన?
కృష్ణ తత్వం!.
శాపం వస్తుందని తెలిసీ
గురువు నిద్ర చెడకూడదని
బాధను భరించిన
కుంతీ తనయుడు!.
గురువు నేర్పిన
అక్షరాలకు అర్థమై...
గురువు కలలకు
విజయమై...
గురువు అడుగుల్లో
శిఖరమెక్కి...
గురువు నమ్మకానికి
నిజమై నిలిచి...
గురువు పాఠానికి
బతికున్న సాక్ష్యమై...
గురువు నాటిన
మొక్కలో
మహా వృక్షమై...
తన గెలుపును
గురువుకు గురుదక్షిణగా ఇచ్చి
తన కీర్తిలో
గురువు పేరును నిలిపే వాడే?
నిజమైన శిష్యుడు!

**–శివకుమార్. వై**
9989385898

### శిష్యుడా!

వినయమనే ప్రమిదలో
ఓర్పు అనే వత్తిని ఉంచు,
కృషి అనే తైలాన్ని నింపు,
సద్గురువు వద్దకు చేరు,
నిన్ను సరిజేసి వెలిగిస్తాడు,
నీ జీవితానికో వెలుగిస్తాడు.
మొక్కగానే గురువును చేరు,
మొక్కుతూనే మంచిని కోరు,
అంటును కట్టించుకో,
కొ(మ్మ)మ్మలు నరికించుకో,
చక్కని మానును చేస్తాడు,
పలురకాల ఫలముల పంట
నిస్తాడు...
గురువంటే
ఒక చేయితిరిగిన శిల్పి
బండ రాయిలా
ఉండాలనుకోకు,
శిల్పంగా మారాలనే తపనతో
వెళ్ళు,
పరీక్షల దెబ్బలను తట్టుకో,
నగిషీల చెక్కుళ్ళను ఓర్చుకో,
నిన్నొక అద్భుత శిల్పంగా
మారుస్తాడు.

**–గోలి హనుమచ్ఛాస్త్రి**
8500222048

### గురు శిష్యులు

శిష్యుడు...
పాఠాలు చదివే వ్యక్తి కాదు,
జ్ఞాన దాహాన్ని చేతబట్టి
విజ్ఞాన గంగ వైపు
నడిచే యాత్రికుడు.
గురువు చూపిన అక్షరం..
చీకటి నుంచి వెలుగుకు ద్వారం
గురువు చెప్పే మాట
జీవితాన్ని మలిచే ఉలి...
శిష్యుడు ప్రశ్నిస్తాడు...
వాదించడానికి కాదు,
సత్యాన్ని చేరుకోవడానికి...
వినమ్రంగా వంగుతాడు...
భయంతో కాదు,
విలువలను నేర్చుకోవడానికి...
విత్తనం నేలను ఆశ్రయించినట్లు,
శిష్యుడు గురువును ఆశ్రయిస్తాడు.
విత్తనం చెట్టై ఎదిగి...
ఆకాశాన్ని తాకుతుంది
శిష్యుడు వామనరూపంనుండి
విరాటరూపమై..
గురు పటిమ
ప్రపంచానికి చాటుతాడు...
శిష్యుని చేతిలో పుస్తకం..
కాగితాల దొంతర కాదు
అనుభవాల అరణ్యంలో
దారి చూపే దీపస్తంభం...
అతని కళ్లలో
కలలు ఉంటాయి,
ఆ కలల్లో కర్తవ్యం
ఉంటుంది...
అతని అడుగుల్లో
ఆశ ఉంటుంది,
ఆ ఆశలో సమాజం కోసం
ఏదో చేయాలనే తపన
ఉంటుంది...
గురువు బోధించిన జ్ఞానాన్ని
దాచుకోవడం
శిష్యత్వం కాదు...
ఆ జ్ఞానాన్ని జీవితంలో
ఆచరించి..
ఇతరులకు మార్గాన్ని చూపే
దారి దివిటీగా మారడమే
నిజమైన శిష్యత్వం...
నది సముద్రాన్ని చేరినట్లే
శిష్యుడు జ్ఞాన పరిపూర్ణత
చెందాలని తపిస్తాడు...
పర్వతం పెనుగాలులకు
చెదరక నిలిచినట్లు..
కష్టాలకు బెదరక
నిలబడతాడు...
అతనికి తెలుసు..
ప్రతి పరీక్ష వెనుక
ఒక పాఠం ఉందని,
ప్రతి పాఠం వెనుక
ఉన్నతమైన మనిషి
దాగి ఉన్నాడని...
శిష్యుడు అంటే
గురువుకు శిరసు వంచి
నమస్కరించే వాడే కాదు..
సత్యం ముందు తలవంచే
వాడు,
జ్ఞానాన్ని ఆరాధించే వాడు,
విలువలతో జీవించే వాడు...
భూమిపై గురువులు..
జ్ఞానాన్ని వెలిగించే దీపాలైతే..
శిష్యులు..
ఆ వెలుగులను
మోసుకెళ్లే జ్యోతులు...

**–వక్కలగడ్డ వేంకటేశ్వర రావు**
9849559581

### శిష్యుడు

కనులు తెరవని వాడి కోసం
ఇద్దరు గురువులు కళ్ళల్లో
వత్తులేసుకుని చూశారు –
ఊపిరిలో దీపం వెలిగించింది తల్లి,
చూపులో దారిని గీశాడు తండ్రి.
ఆ దీపం వెలుగులో జీవితమనే
నిత్య గురువు ఎదురయ్యాడు...
చేయి పట్టుకోడు, పరీక్ష పెడతాడు,
ఓదార్చుడు, నేర్పిస్తాడు.
ఆ పరీక్షల నడుమే
అక్షరాల గురువులు దొరికారు,
వారు ఇచ్చింది పాఠం కాదు,
పగిలి మొలకెత్తు శక్తిని ఇచ్చారు.
ఆ శక్తి నుండే శిష్యుడు మొలకెత్తాడు..
వేరుగా దిగి,చెట్టుగా ఎదిగి,
చెరగని సంతకమై మిగిలాడు.
ఎదిగే కొద్దీ నేలకు దగ్గరైనాడు.
శిఖరాన నిలిచినా,ఒదిగి నేర్చుకునే విద్యార్థే అతడు.
శాస్త్రాలను రచించిన,
అనుభవం వెనుక నడిచే నిత్య శిష్యుడతడు.
తనను నిలబెట్టిన ఋణం తీర్చడానికి
తానే పునాది అయ్యాడు –
తనపై నిలిచినా ప్రతివాడు
తనకంటే ఎత్తుగా ఎదిగేలా...

**–లీలాకృష్ణ**
99494 51056

# అర్జునుడిలా గురి తప్పని పాశుపతాస్త్రాన్ని సంధించిన "అక్షర తూణీరాలు"

తమ్మా ధనంజయ రెడ్డి ప్రముఖ కవి, సేవా తత్పరులు గుంటూరులోని ఎస్.హెచ్.ఒ ఏపీ యూట్యూబ్ ఛానల్ ఇంటర్వ్యూయర్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థలో మెడికల్ క్యాంప్స్ చైర్మన్ గా వివిధ రకాల సేవలను అందిస్తున్నారు. వీరు ఇటీవల "అక్షర తూణీరాలు" మినీ కవితా సంపుటిని వెలువరించారు. ఈ కవితా సంపుటి పేరులోనే కొత్తదనాన్ని సంతరించుకొని కవితలన్నీ కూడా అద్భుతంగా ఉన్నాయి. మినీ కవితలైనా ఎన్నో సరికొత్త భావాన్ని ఆవిష్కరించాయి. ఈ కవితా సంపుటిలో కవితలు చాలా వరకు సామాజిక అంశాలకి పెద్దపీట వేశాయి. ఇందులో ''కుటుంబ బంధాలు, బాధలు, సామాజిక చైతన్యం కలిగించేవి, మానవతా విలువలకు అద్దం పట్టేవి, నేటి సమకాలీన రాజకీయాలపై అస్త్రాన్ని సంధిస్తూ రాజకీయ నాయకులు చేసే తప్పిదాలను హాస్యంగా, వ్యంగ్యంగా, చమత్కారంగా తెలియజేస్తూ, వరద ముంపులు గురించి, వైద్యరంగంలో ఉన్న కొన్ని లోపాలు, అవినీతిపై అస్త్రం సంధిస్తూ, చీకటి వ్యాపారం గురించి, రైతన్నల ఈతి బాధలు, అవకాశవాదం ఇలా ఎన్నో మరెన్నో అంశాలపై అర్జునుడిలా( ధనుంజయ అంటే అర్జునుడు అని అర్థం) గురి తప్పని పాశుపతాస్త్రాన్ని సంధిస్తూ అక్షర తూణీరాలుగా మలిచి సాహితీ పూతోటలో అందంగా విరబూయించారు. ఇప్పుడు మనం ఆ కవితల్లోని మాధుర్యాన్ని చూద్దాం.

మొదటి కవిత ''దేహాన్ని **రక్షించాల్సిన /తెల్ల రక్త కణాలే దాడి చేస్తే/ అది క్యాన్సర్!/ దేశాన్ని పాలించాల్సిన/ నాయకులు దోచేస్తే అది/ కరప్షన్!!/"** తమ్మా ధనంజయ రెడ్డి గారు రచించిన ఈ **'నాయకుడు'** మినీ కవిత వైద్య శాస్త్ర సూత్రాన్ని, ప్రస్తుత రాజకీయ వాస్తవికతను అత్యంత సహజంగా ముడిపెట్టి చెప్పిన సామాజిక హెచ్చరిక. శరీర రోగాన్ని దేశ రోగంతో పోల్చి నాయకుల బాధ్యతారాహిత్యాన్ని సూటిగా నిలదీసిన శక్తివంతమైన భావవ్యక్తీకరణ ఇది. **పాపం వాళ్లకేం తెలుసు?/ అప్పట్లో/ తమ పిల్లలకు నేర్పిన/ దాగుడుమూతల ఆటను/ ఇప్పుడు ఏళ్ల తరబడి/ దొరక్కుండా ఆడతారని!/ ఈ వృద్ధులు'** మినీ కవిత ప్రస్తుత సమాజంలో వృద్ధాప్యం ఎదుర్కొంటున్న అత్యంత విషాదకరమైన ఒంటరితనాన్ని, మానవ సంబంధాల క్షీణతను కదిలించేలా ఆవిష్కరించింది. బాల్యపు ఆట – వృద్ధాప్యపు వేదనతో కూడి చిన్నతనంలో తల్లిదండ్రులు తమ పిల్లలతో ప్రేమగా, సరదాగా **'దాగుడుమూతల'** ఆట ఆడిస్తారు. ఆ ఆటే కాలక్రమంలో ఒక చేదు నిజంగా మారి, పెద్దయ్యాక పిల్లలు తల్లిదండ్రులను పట్టించుకోకుండా, వారికి 'దొరక్కుండా' తప్పించుకు తిరగడానికి దారితీస్తుందని కవి హృదయవిదారకంగా చెప్పారు. **''మొన్న అవసరం!/ నిన్న ఇష్టం!/ నేడు వ్యసనం!!!/ మనిషి మస్తిష్కానికి పట్టిన/ గ్రహణమే మనీ!"** ఈ మినీ కవిత డబ్బు చుట్టూ తిరుగుతున్న మనిషి మానసిక స్థితిని, ఆధునిక సమాజపు ధనవ్యామోహాన్ని సూటిగా తెలియజేసింది. **"ఇటీవలే రిటైర య్యాడట..! లంచం ముట్టనిదే/ చేతులు వణుకుతున్నాయని/ డి అడిక్షన్ సెంటర్లో చేర్పించారు!!"** సాధారణంగా మత్తు అలవాట్లను మాన్పించడానికి తీసుకెళ్ళే 'డి-అడిక్షన్ సెంటర్'కు లంచం మరిగిన వ్యక్తిని తీసుకెళ్లాల్సి రావడం కవి ప్రయోగించిన అద్భుతమైన వ్యంగ్యాస్త్రం.

అవినీతి అనేది కేవలం తప్పు మాత్రమే కాదు, అది నయం చేయలేని ఒక మానసిక రోగం, వ్యసనం స్థాయికి చేరిందని నవ్వు తెప్పిస్తూనే తీవ్రంగా ఆలోచింపజేసేలా రాసిన అద్భుతమైన కవిత. ''పేదరికం'' కవితలో **''అందరూ వెళ్లి/ పరామర్శించక పోవడానికి/ ఆ పెద్దాయన/ ప్రాణాలు విడిచింది/ 'కోవిడ్'తో కాదు!/ అంతకంటే ప్రమాదకరమైన/ పేదరికంతో...!!/"** ఈ 'పేదరికం' మినీ కవిత సమాజంలోని ద్వంద్వ ప్రమాణాలను, దారిద్ర్యం సృష్టించే ఒంటరితనాన్ని అత్యంత హృద్యంగా ఆవిష్కరించింది. సమాజాన్ని భయపెట్టిన మహమ్మారి కోవిడ్ కన్నా, మానవ సంబంధాలను దూరం చేసే పేదరికమే అత్యంత ప్రాణాంతకమైన వ్యాధి అని కవి వ్యంగ్యంగా, కన్నీరు పెట్టించేలా అక్షరీకరించి చెప్పారు.

కీర్తి కాంక్ష కవితలో **"ఒంటినిండా/ శాలువాలు కప్పుకు/ తిరుగుతుంటే/ మలేరియా అనుకున్నా!/ తర్వాత తెలిసింది.../ అతన్ని వేధిస్తున్నది/ మందుల్లేని/ మాయదారి రోగం అని!!''** ఈ మినీ కవిత నేటి సమాజంలో పెరిగి పోయిన సన్మాన వ్యామోహాన్ని, ఆత్మస్తుతి పిచ్చిని అద్భుతమైన హాస్య వ్యంగ్యంతో తెలియజెప్పింది. అంటే నిజమైన ప్రతిభ కంటే బాహ్య ఆడంబరాలకు, సన్మానాలకు ప్రాధాన్యమిచ్చే నేటి తరం ప్రచార పిచ్చిని నవ్వు తెప్పిస్తూనే ఆలోచింపజేసేలా చిత్రించిన చక్కని కవిత ఇది. **నిర్లక్ష్యం** కవితలో **నిర్లక్ష్యానికి/ నెలలు నిండాయి/ ప్రమాదాన్ని/ ప్రసవిం చింది!!** ఈ కవిత






ప్రతులకు:
తమ్మా ధనుంజయ రెడ్డి,
ఏనుగంటి నైస్ అపార్ట్మెంట్,
గోరంట్ల, గుంటూరు–522034
సెల్: 9908734363

బాధ్యతారాహిత్యం, అలసత్వం వల్ల జరిగే అనర్థాలను అత్యంత లోతుగా, పదునుగా ఆవిష్కరించింది. కేవలం నాలుగు చిన్ని పాదాల్లో ప్రసవ ప్రక్రియను ప్రతీకగా వాడుకుని, నిర్లక్ష్యం ఎంతటి పెను విపత్తుకు దారితీస్తుందో ఆలోచింపజేసేలా తీవ్రమైన హెచ్చరికను జారీ చేశారు కవి. **"కాక్రోచ్"** లు మినీ కవిత **"కాక్రోచ్ లను/ నిందించడమెందుకు?/ ఇంటిని/ శుభ్రంగా ఉంచుకుంటే/ సరిపోతుందిగా!"** ఈకవిత ఇల్లు అపరిశుభ్రంగా ఉంటే బొద్దింకలు (అంటే కాక్రోచ్లు) ఎలా చేరతాయో అలాగే సమాజంలో లేదా మన జీవితంలో సమస్యలు, దుష్ప్రభావాలు చేరడానికి మన సొంత అజాగ్రత్తే కారణం అంటారు కవి. **"డీజే"** కవితలో **"మితమైతేనే చెవులకు/ వింపు!/ శృతి మించితే మాత్రం/ చావుకి డప్పే"!!/** ఈ కవిత శబ్ద కాలుష్యం కలిగించే తీవ్ర పరిణామాలను సూటిగా, స్పష్టంగా తెలియజేస్తుంది. డీజే లేదా సంగీతం మోతాదు మించి విపరీతమైన శబ్దంతో

## పుస్తక సమీక్ష

మోగితే, అది ఆరోగ్యాన్ని దెబ్బతీసి ప్రాణాలకే ప్రమాదం గా మారుతుంది. గుండె జబ్బులు ఉన్నవారికి, వృద్ధులకు, చిన్నపిల్లలకు విపరీతమైన సౌండ్ ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందని కవి చక్కని హెచ్చరిక జారీ చేసారు. మరో చక్కని కవిత చూడండి తల పండింది కవితలో **"తల పండిన వాడని/ గౌరవించడం మొదలుపెట్టారు!/ తలకు గోరింటాకు/ పెట్టుకున్నాడనే/ సంగతి తెలియక!!"/** ఈ కవిత బాహ్య రూపాన్ని చూసి మోసపోయే లోకరీతిని, నకిలీ మేధావులను చక్కని హాస్య వ్యంగ్యంతో తెలియజేసింది. అంటే పైపై మెరుగులను, బాహ్య రూపాన్ని చూసి ఎవరి జ్ఞానాన్నీ గుడ్డిగా నమ్మవద్దని నవ్వు తెప్పిస్తూనే ఆలోచింపజేసే కవిత ఇది.

మరో కవిత **"అతిలోకసుందరి" "ప్రస్తుత ప్రజాస్వామ్యంలో/ రాజ్యాలు లేవు కాబట్టి/ సరిపోయింది!/ లేకుంటే తనకోసం../ ఎన్ని యుద్ధాలు జరిగేవో!!"** ఈకవితలో ప్రస్తుత కాలంలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఉంది కాబట్టి సరిపోయింది కానీ, ఒకవేళ రాచరికాలు ఉండి ఉంటే ఈమె అపురూప సౌందర్యం కోసం ఎన్ని దేశాల మధ్య యుద్ధాలు జరిగేవో అంటూ నాయిక అందాన్ని అద్భుతమైన హాస్య వ్యంగ్యంతో, అత్యున్నతమైన పోలికతో ధనుంజయరెడ్డి గారు కళ్ళకు కట్టినట్లు తెలియజేసారు. **''పగ''** కవితలో **''ఎప్పుడో పాము/ కరిచిందట...!/ అప్పటి నుండి/ పగతో/ రగిలిపోతున్నాడు!''/** ఈ కవితలో జరిగిపోయిన చేదు సంఘటనలను వదిలేయకుండా, ద్వేషం అనే విషాన్ని గుండెల్లో మోస్తూ తన ప్రశాంతతను తానే నాశనం చేసుకునే సంకుచిత మనుషుల తీరును ఈ కవిత వ్యంగ్యంగా స్పష్టం చేసింది. **"సారీ"** కవితలో **"వచన కవిత/ వ్రాయాలనుకున్న ప్రతి'సారీ'.../అతను/ వచ్చిన కవిత్వాన్నే/ వ్రాస్తున్నాడు!"/** ఇది సాహిత్యంలో సృజనాత్మకత, కొత్తదనం లోపించి ఒకే మూసలో కొట్టుమిట్టాడుతున్న రచయితల తీరును నవ్వు తెప్పించేలా విమర్శించిన కవిత, సింపుల్ గా చాలా బాగుంది. **"బాబాకాదు"** కవిత **"బద్ధకంతో గడ్డం/ పెంచాడతడు!/బాబా అనుకొని/ కాళ్ళ మీద/ పడ్డా ...!!"** ఈకవితలో బాహ్య వేషధారణలను, రూపాలను చూసి దైవత్వాన్ని ఆపాదించే సమాజపు మూఢత్వాన్ని, ఆ అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వెలిసే నకిలీ బాబాల సంస్కృతిని ఈ కవితలో హాస్యంగా, ముక్కు సూటిగా తెలియజేశారు. **"బెయిల్"** కవితలో **"ఆ నేరస్థుడు/ బైక్ మీద కంటే/ బెయిల్ మీదే/ ఎక్కువగా/ తిరుగుతుంటాడు!"** ఈ కవిత చదవంగానే పొట్ట చెక్కలయ్యేలా నవ్వొచ్చింది. సమాజం లో నేరాలు చేసే వ్యక్తికి చట్టం అంటే భయం లేకుండా పోయింది. బైక్ ఎక్కి తిరిగే దానికంటే సులువుగా, బెయిల్ తెచ్చుకుని స్వేచ్ఛగా సమాజంలో తిరుగుతున్నాడనడం వ్యవస్థాగత బలహీనతను చక్కగా సూచిస్తుంది. **"ప్రిస్క్రిప్షన్"** కవితలో **"నీ తలరాత/ బాగుంటేనే.../ వైద్యుడి చేతిరాత/ అర్థమయ్యేది!"** సాధారణంగా డాక్టర్లు రాసే ప్రిస్క్రిప్షన్ చేతిరాత ఎవరికీ అంత తేలికగా అర్థం కాదు. ఆ రాత సరిగ్గా అర్థమై, మెడికల్ షాపు వాళ్ళు సరైన మందులు ఇచ్చి ప్రాణాలు దక్కాలంటే ముందుగా మన 'తలరాత' అంటే అదృష్టం బాగుండాలని ధనుంజయ రెడ్డి గారు అద్భుతమైన చమత్కారంతో ఆవిష్కరించారు. **"లంచావతా రులు"** కవిత చూడండి పొట్ట చెక్కలయ్యేలా నవ్విస్తుంది. **"మలబద్ధకం ఉన్నా/ ముక్కగా ముక్కగా/వని అవుతుందేమో గాని.../ఆ ఆఫీసులో ఉన్న/ బద్ధకస్తుల కాళ్లకు/ మొక్కినా సరే/ ఏ పని కాదు!!''** ఒక శారీరక సమస్యను అంటే మలబద్ధకం సమస్యను పాలనా వ్యవస్థలోని మొద్దునిద్రతో పోల్చి, కార్యాలయాల చుట్టూ తిరిగే సామాన్యుడి నిస్సహాయతను, ఉద్యోగుల బాధ్యతారాహిత్యాన్ని నవ్వు తెప్పిస్తూనే అత్యంత ఘాటుగా, హాస్యంగా ఎత్తిచూపారు కవి. మరో కవిత **"బీరువా" "అమ్మ ఏమో/ చలికి వణుకుతూ/ వరండాలో..!/ తన ఒంటిమీద/ బంగారం మాత్రం భద్రంగా/ బీరువాలో!!** ప్రాణమున్న తల్లి కంటే చేతనం లేని నగలకే రక్షణ, ప్రాధాన్యత దక్కే నేటి సమాజపు వికృత పోకడలను, వృద్ధాప్యంలో తల్లులు ఎదుర్కొంటున్న నిరాదరణను అత్యంత గాఢంగా కళ్ళకు కట్టినట్లు ఈ చిన్ని కవితలో ఎంతో హృద్యంగా తెలియజేశారు కవి.

**"బుడమేరు"** కవిత **"వరద కాదది!/ కుప్పలు తెప్పలుగా/ పేర్చిన/ మానవ తప్పిదాలను/ కప్పేసిన/ నీటి పరదా!!"** ఈకవితలో 'వరద పరదా' అనే ప్రాసతో ప్రకృతి విపత్తుల పేరిట సమాజం, వ్యవస్థలు తమ సొంత తప్పులను కప్పిపుచ్చుకుంటున్న వైనాన్ని పదునైన వాస్తవికతతో ఆవిష్కరించారు కవి. చివరిగా "నిరాశల నిశీధి" కవిత చూద్దాం. **"నిశాచర జీవిలా/ నిరీక్షిస్తున్నా..!/ నిరాశల నిశీధిని/ తరిమికొట్టే/ జాబిల్లి కోసం!!"** **'నిశాచర, నిరీక్షిస్తున్నా, నిరాశల, నిశీధి'** అంటూ 'ని' అక్షర ప్రాసతో వినసొంపైన లయను సాధిస్తూనే, ఎంతటి చీకటి పరిస్థితుల్లోనైనా ఆశను వదులుకోకూడదనే అంతర్గత స్థైర్యాన్ని అందించిన చక్కని కవిత ఇది. ఇలా ఈ మినీ కవితా సంపుటిలోని కవితలన్నీ కూడా చాలా ఆసక్తిదాయకంగా ఉన్నాయి. ఆణిముత్యాల్లాంటి కవితలన్నీ కూడా పాఠకుల్ని మొదటి నుంచి చివరి దాకా చదివిస్తూ పాఠకుల మనసుకి హత్తుకునేలా మలచి పుస్తక రూపంలోకి తెచ్చారు ధనుంజయ రెడ్డి గారు.

ఇంకా ఈ **"అక్షర తూణీరాలు"** మినీ కవితా సంపిటిలో **"ఓటు, అధికారం, జెండా, నిజాయితీ, సారా కొట్టు, లంచం, తలపండింది, హంతకులు, నారదుడి చెల్లి, నోట్ల కట్టలు, బలుపు, డబుల్ స్టాండర్డ్, గండపెండెరం, టెంటు పీకారు..."** లాంటి ఎన్నో బుజ్జి, బుజ్జి కవితలు పాఠకుల మనసును దోచుకున్నాయి. ఫ్రెండ్స్ మీరందరూ కూడా ఈ మినీ కవితా సంపుటిని చదివి ఈ కవితల్లోని మాధుర్యాన్ని ఆస్వాదిస్తారు కదూ. ఇంత చక్కటి "అక్షర తూణీరాలు" మినీ కవితా సంపుటిని పాఠకులకు కానుకగా అందించిన తమ్మా ధనుంజయ రెడ్డి గారికి శుభాభినందనలు.



**-భాగ్యలక్ష్మి,**
704725609

## సప్త పదులు



ప్రక్రియా సృజనకర్త:
**సుధామ**
సెల్:9849297958

దానం
వాగ్దానం

చేస్తానని
మాటిచ్చిన మనిషి
అంతలోనే
అంతర్ధానం
**-ఋష్యశృంగు ధిల్లేశ్వరరావు**

జీవనము
పావనము

జీవితంలో
అందమైన
ఆనందాల
ప్రాయమే యవ్వనము
**-ప్రసాద్ రావు,**
విజయనగరం.

చూడామణి
భార్యామణి

ఎందుకోమరి
శ్రీకృష్ణుడు సైతం
తిరస్కరించాడు
శమంతకమణి
**-సమీ ఉల్లాఖాన్,**
ఖమ్మం

ఇత్తడి
పుత్తడి

నేతిబీరకాయల
మాటలు వింటే
బ్రతుకు
చిత్తడి .
**-వి. సుబ్బారావు**
పెందుర్తి, వైజాగ్

అతుకులు
గతుకులు

పూర్వకాలంలో
ఆనందంగా
కలసిమెలసి
సాగేవి బతుకులు
**-బి.ఎ.ఎస్. ప్రసాద్**
నల్లజర్ల

సేద్యం
వైద్యం

సాధ్యాసాధ్యాలు
పట్టని ప్రభుత
చూస్తున్నారు
చోద్యం.
**-వి యస్ శాస్త్రి ఆకెళ్ళ**
విజయనగరం.

దేహం
మోహం

అధః పాతాళానికి
తప్పక
నెట్టేస్తుంది
అహం
**-తిరుమల ఆముక్తమాల్యద,**
చెన్నై

విరహాలు
కలహాలు

వధూవరులు
ఒక్కటయ్యేందుకు
అమ్మలక్కలు ఇవ్వాలి
సలహాలు!
**-డా.గన్నోజు శ్రీనివాసాచారి**
మహబూబ్ నగర్

చిందర,
వందర,

కాస్త చూసుకుంటా
నడువు
ఏమున్నదో
ముందర.
**-చెరుకుపల్లి గాంగేయ శాస్త్రి,**
రాజమండ్రి

ప్రేరణ
ధారణ

మంచిని
ఎన్నుకుని
చెడుని చేయాలి
నివారణ
**-కామేశ్వరి**
హైదరాబాదు

## నేటి నిజం...

ఏవడైతే నాకేంటి
ఒక్క మాటతో
తేనె తట్టే మీదికి
రాయి విసిరాడు..
ఎవడో మరి
సుడిగాలి మాదిరిగా
చీమల పుట్టను
కదిలించి వేశాడు
ఎవడో వచ్చి వడిగా
మాయలో జోగి
మత్తులో నిద్రిస్తున్న
అలల్ని తట్టి లేపాడు
కీటకాలు గా
లెక్కల్లోలేని ప్రాణాలు
గళాలువిప్పి
గర్జనలు చేశాయి
హేళనచేయబడ్డ
ధూళికణాలు తుఫానై
పీఠాధిపతుల అరికాళ్ళలో
భూకంపాలు పుట్టించాయి.
లాఠీలు..తూటాలు
అణచివేతల ప్రతిభందాలు
నేరారోపణలు..కుట్రలు
దాసోహమై మోకరిల్లాయి.
అడిగితే అరాచకవాది
ప్రశ్నిస్తే విప్లవ వాది
నిలదీస్తే దేశద్రోహి
ముద్రలను చెరిపేశాయి.
మత్తు వలల మాయల
మర్మాలను విప్పిచూపి
నీటుగా దాచబడ్డ
నేటి నిజం ఎత్తిచూపాయి
మొత్తానికి..
దూది గుట్టలో నిప్పురవ్వ
ఎవరార్పగలరు ..
ఏదో మూల మండుతుంది
"బలవంతమైన సర్పము
చలి చీమల చేతచిక్కి"
చెవులు కొరుక్కుంటున్నారు..
ఇదే నేటి నిజమని.....

**-చకోనా**
9885797375



మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1883వ రోజు **'అక్షరాస్యత'** అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'అక్షరాస్యత' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

-సంపాదకులు



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
**-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు,** 9441046839

### అక్షర సేద్యం!

బీజాక్షరం
ఒకే ఒక అక్షరం
అక్షర సేద్యం
గద్య పద్య నవలాకావ్యంగా
సాహితీ క్షేత్రం వైపు
అడుగులు వేస్తుంది
అనంత విశ్వాన్ని
పరిచయం చేస్తుంది
శూన్యంలో
అద్భుతాలను సృష్టిస్తుంది
విరజిమ్ముతుంది నిశీధిలో
విజ్ఞానపు కాంతులను
ప్రసరింపజేస్తుంది
అణువణువులో నిండిన
శక్తిని ఆవిష్కరిస్తుంది
శోధిస్తుంది
అనంత విజ్ఞాన శాస్త్రాన్ని.
భావాల తూణీరంలో
రెండే రెండు సిరా చుక్కలతో
అక్షర దండోరా వేస్తుంది
మార్పుకి శ్రీకారం చుడుతుంది
ఉద్యమమై ఎగసి పడుతుంది
విప్లవ శంఖమై నినదిస్తుంది
అన్యాయాలను ప్రశ్నిస్తుంది
అక్రమాలను అరికడుతుంది
తూటాగా మారి
ధైర్యంతో అడుగులు
ముందుకు వేయిస్తుంది
శత్రువుల గుండెలకు
గురిపెడుతుంది
అజాతశత్రువులా..
మనసుని ప్రేమిస్తుంది
అక్షర ఆరాధనతో
కిలకిలా నవ్విస్తుంది
సిరి పంటల సౌభాగ్యాలతో
ప్రకృతిని ఆస్వాదిస్తుంది
కల్మషం లేని
నిర్మలమనస్సుతో
కలమే హలమై
స్వేదం చిందిస్తుంది
శ్రమైక్య జీవితమే
ప్రగతి పథమని
అక్షర బీజం వేస్తుంది
భవితను పండించాలని
వటవృక్షమంత విశాలంగా
మానవత్వం పండాలని
కలం అక్షర బలంతో
కొండల నైనా పిండి చేసేస్తుంది
అక్షరీకరణమై
ప్రణవ నాదం వేదంగా
ఆధ్యాత్మిక ప్రయాణం
కొనసాగిస్తుంది.
**-పి.పద్మావతి**

### అక్షరం ఉంటే అన్నీ ఉన్నట్టే!

ఇంటికి దీపం ఎలా వెలుగిస్తుందో
నాలుగు అక్షరం ముక్కలు వస్తే
ఆ ఇంటిలో దీపం వెలిగినట్లే!
అక్షరం క్షరం లేనిది కదా!
డబ్బును ఎవరైనా దోచవచ్చు!
మాన మర్యాదలు దోచవచ్చు!
దోచబడనిది విద్య ఒక్కటే!
ఇది లేనివాడు వింత పశువే!
నిరక్షరాస్యుడికి ఎదురవుతాయి
ప్రతిచోటా అవమానం, అసహ్యం!
గౌరవించడం అసలు జరగదు!
చదువుంటే ఆచి తూచి మాట్లాడొచ్చు!
పదిమందికి విద్య నేర్పించొచ్చు!
ధైర్య సాహసాలు నూరిపోయొచ్చు
విప్లవాలని అణిచి వేయొచ్చు!
మోసాలను అరికట్టవచ్చు!
యుక్తాయుక్త జ్ఞానం పెంపొందొచ్చు!
తల్లిదండ్రులను ప్రేమించడం ఎలాగో
తోబుట్టువులతో
సఖ్యంగా ఎలా ఉండాలో
నలుగురిలో ఎలా మెలగాలో
కష్టకాలంలో ఎలా నిలదొక్కుకోవాలో
ఆపత్కాలంలో సాయం ఎలా చేయాలో
ఆచార, సంప్రదాయాలు
పాటించేది ఎలాగో
అక్షరాస్యత నేర్పిస్తుంది మనిషికి!.
**-కోలా సత్యనారాయణ**

### క్షరం లేనిది

రూపాలెన్నెన్నో మారినా
ఏనాటికీ రూపుమాసిపోనిది
కాలాల నదీతీరాన
ఎన్నటికీ కరిగిపోని
అమృతధార ఇది.
మృణ్మయమైన ఈ శరీరానికి
మరణం ఉంటుంది కానీ
కలంలోంచి పుట్టిన శబ్దానికి
హృదయ భావానికి చావు లేదు.
కత్తుల పదును తెంపలేని
దృఢమైన బంధం
ప్రళయాగ్ని కూడా
కాల్చివేయలేని శాశ్వత సత్యం
తరతరాల నాగరికతలను
మోసే జ్ఞాన చైతన్యం
మనిషి నిర్మించుకున్న
ఏకైక అమరకావ్యం
క్షరం లేని అక్షరం!.
రాతి యుగం నుంచి
అంతరిక్ష యుగం దాకా,
ఓటమి చీకట్లను చీల్చే
చైతన్య వెలుగు ఇది.
కలంలోంచి జారిన
ఒక చిన్న సిరా చుక్క
యుగాలను దాటే
మహత్తర ఆలోచనై నిలుస్తుంది.
రాజుల సింహాసనాలు
కాలగర్భంలో కలిసిపోవచ్చు
మహా సామ్రాజ్యాల సరిహద్దులు
తుడిచిపెట్టుకుపోవచ్చు
హృదయపు పొరల్లోంచి
ఉద్భవించిన అక్షరం
తరతరాల మనస్సుల్లో
ఎప్పటికీ వెలుగుతూనే ఉంటుంది.
**-గుండవరం కొండల్ రావు**

### క్షరం కాని అక్షరం

క్షరం కానిది
నశ్వరమునైనది
క్షితిలో అమూల్యమది
క్షీరంలా అమృతమయం.
క్షణ క్షణం
తపనను కలుగజేయుస్తుంది
క్షుద్బాధను మరపింపజేస్తుంది
క్షేత్రంలో మేలిమి బీజం.
క్షమ దమాది గుణాలను
కలుగజేస్తుంది
క్షీర నీర న్యాయాన్ని బోధిస్తుంది.
క్షీణ దశ ఎరుగనిది
క్షణికమైనవి కాక
శాశ్వత లాభాలు చేకూరుస్తుంది.
క్షయం కానిది
క్షానీతి లోన
విజ్ఞాన కాంతులు వెదజల్లేది
క్షేమం చేకూర్చేది
క్షోణిలో గౌరవం పెంచేది
క్షరం కాని అక్షరమది!.
**-చంద్రకళ దీకొండ**

### అమృత మథనం

భాష ఏదైనా
భావం అక్షర రూపమైతే స్మరణం
కాలం ఏదైనా
అక్షరం గురు సుముఖతే ధన్యం.
వేల భాషలలో విరిసే
వెన్నెల కలువల అక్షరాలు
ఓ సింగిడి పూసినట్టు
పిల్లల చేత దిద్దించే యోగాలు.
సదువు ఎన్ని మెట్లు ఎక్కినా
అక్షరం నుండి
సంస్కారం అలవర్చుకోపోతే
జీవనశైలికే మచ్చ
అవినీతితో అంటకాగితే
అక్షరజ్ఞానమే నిరర్థకం.
కలిని ఆలింగనం చేసుకుని
జగతిని భ్రష్టు పట్టిస్తున్నారు
తా పట్టిన కుందేలుకు
మూడే కాళ్ళు
సిద్ధాంతంతో రాద్ధాంతం చేస్తున్నారు.
న్యాయ పీఠం
నివ్వెరపోయేలా నడవడి
ధర్మం అచ్చెరువొందేలా
దారిలో గొలిముడిముళ్ళేస్తూ
పోటాపోటీగా
బక్కోళ్ళపై
బలిసినోళ్ళ పటాటోపం.
అక్షరం ధర్మోపనిషత్తై
ధరణిని ముద్దాడగా
సామాజిక రుగ్మతలకు
శస్త్రచికిత్స చేయాలి
పాలకుల కక్షల వివక్షలపై
సమతను నిలపాలి
ఈ జగతి
మానవ తప్పిదాల్లేని
బుద్ధిజీవులతో వర్ధిల్లాలి.
**-ఏదెల్లి రాములు**

### అక్షరాలు

అక్షరాలు అజ్ఞానాన్ని తొలగించి
కలిగిస్తాయి విజ్ఞానాన్ని
చాలా మందికి జీవనోపాధి
ఆలోచన కలుగజేస్తాయి
చదువుతో
మానవ సంబంధాల పెరుగుదల
కొంతమందిలో ఏమైనా మార్పు
బంధాలతో కలుపుతాయి
రెండు మనసులను.
అక్షరాలు
పరిష్కారం చూపుతాయి
సమస్యలకు
సమస్యల సుడి నుండి
దారి మళ్ళిస్తాయి.
మనుషులలో
మార్పు తేవచ్చు అక్షరాలతో
గమ్మత్తులు చేయవచ్చు అక్షరాలతో.
**-డా.షహనాజ్ బతుల్**

### అందరి బాధ్యత

అక్షరాస్యత అంతరార్థం
చదవడం, రాయడం
అర్థం చేసుకోడం
అక్షరాస్యత
మానవ ప్రాథమిక హక్కు
అక్షరాస్యతతోనే
ఆత్మవిశ్వాసం
ఆదర్శ వ్యక్తిత్వం
సామాజిక చతన్యం
ఉన్నత సంస్కారం
అసమానత అదృశ్యం
హక్కుల అవగాహనం
సమాజం జ్ఞానవంతం
సమాజం విద్యావంతం
సమసమాజ నిర్మాణం
దేశ పురోగమనం.
అక్షరం ప్రతి ఇంటా
నింపుతుంది వెలుగులు
ప్రతి బిడ్డకూ అందాలి
విద్యాబుద్ధులు
పసి పాదాలు
పట్టాలి బడి బాటలు
అది పౌరులుగా
మనందరి బాధ్యత.
అక్షరాస్యత అందించినప్పుడు ఫలాలు
నిరక్షరాస్యులు అవుతారు అక్షరాస్యులు
అక్షరాస్యతపై తగదు అలసత్వం
అది సమాజ ప్రగతికి శరాఘాతం.
సాధించినప్పుడు అక్షరాస్యత నూరుశాతం
దేశాభివృద్ధికి హద్దు ఇక ఆకాశం.
**-జె.వి.కుమార్ చేపూరి**

# విలువైన కథల విలక్షణ కథకులు



డా॥జి.వి. సుబ్రహ్మణ్యం

తెలుగు కథాసాహిత్యంలో డాక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం గారిది ఒక విలక్షణమైన స్థానం. ప్రధానంగా విమర్శకుడిగా ప్రసిద్ధి పొందిన ఆయన, సృజనాత్మక రచయితగానూ తన ప్రతిభను నిరూపించుకున్నారు. ఆయన రచించిన **'సుశీల కథలు'** జీవనానుభవానికి, కుటుంబ అనుబంధాలకు ప్రాధాన్యమిచ్చిన వరుస కథల సంపుటి. తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి గారు ఆధునిక తెలుగు కథకు కొత్త కథన పద్ధతులను, సామాజిక-పర్యా వరణ స్పృహను జోడించిన విలక్షణ కథకులు. ఈ ఇద్దరి కథల మధ్య సాదృశ్యాలున్నట్లే స్పష్టమైన భేదాలూ ఉన్నాయి.

**ముందుగా సాదృశ్యాలను పరిశీలిద్దాం.**

ఇద్దరు రచయితలూ జీవితాన్ని దగ్గరగా పరిశీలించినవారే. వారి కథలకు ఊహాలోకం కంటే అనుభవ ప్రపంచమే ప్రధాన ఆధారం. సాధారణ మనుషులు, వారి ఆశలు, ఆప్యాయతలు, అపోహలు, బలహీనతలు, సంఘర్షణలు.. వీటినే ఇద్దరూ కథావస్తువులుగా స్వీకరించారు. మనకు నిత్యం కనిపించే వ్యక్తులు, ఎదురయ్యే సంఘటనలే వారి చేతుల్లో సాహిత్య రూపాన్ని పొందుతాయి.

రెండవ సాదృశ్యం మానవ సంబంధాల చిత్రణ. 'సుశీల కథలు'లో దాంపత్యం, కుటుంబ జీవితం, పరస్పర అవగాహన, ప్రేమానురాగాలు కథలకు జీవధాతువులుగా నిలుస్తాయి. పతంజలి శాస్త్రి కథల్లోనూ మనుషుల మధ్య సంబంధాలే ముఖ్యమైనవి. అయితే అవి కుటుంబానికే పరిమితం కాకుండా వ్యక్తికీ సమాజానికీ, మనిషికీ ప్రకృతికీ మధ్య ఉన్న సంబంధాల వరకు విస్తరిస్తాయి.

ఇద్దరి రచనల్లోనూ హాస్యం, వ్యంగ్యం కనిపిస్తాయి. జి.వి. సుబ్రహ్మణ్యం గారి హాస్యం ఇంట్లోని చిన్నచిన్న సంఘటనల నుంచి సహజంగా పుడుతుంది. అది ఎవరినీ గాయపరచని సున్నితమైన చిరునవ్వులాంటిది. పతంజలి శాస్త్రి గారి వ్యంగ్యం మాత్రం సామాజిక వ్యవస్థలోని కపటత్వాన్ని, అధికారుల నిర్లక్ష్యాన్ని, మానవ స్వార్థాన్ని ప్రశ్నించే పదునైన బాణంలా పనిచేస్తుంది.

ఇక భేదాలను పరిశీలిస్తే..మొదటగా కథావస్తువు పరిధిలో వ్యత్యాసం కనిపిస్తుంది. 'సుశీలకథలు' ప్రధానంగా గృహజీవితం చుట్టూ తిరుగుతాయి. సుశీల అనే కేంద్రపాత్ర ద్వారా ఒక కుటుంబం, దాని ఆత్మీయత, జీవితంలోని చిన్నచిన్న ఆనందాలు మనకు కనిపిస్తాయి. అందువల్ల ఈ కథలు వ్యక్తిగత అనుభవాల నుంచి విశ్వజనీనమైన కుటుంబానుభూతిని సృష్టిస్తాయి.

పతంజలి శాస్త్రి కథా ప్రపంచం మరింత విస్తృతమైనది. పేదరికం, స్త్రీల జీవనవేదన, రాజకీయ అవినీతి, భూసేకరణ, అడవుల విధ్వంసం, పర్యావరణ సమస్యలు, ఆధునిక మనిషి ఒంటరితనం వంటి అనేక అంశాలను ఆయన కథలుగా మలిచారు. చిన్న జీవిత శకలం నుంచి పెద్ద సామాజిక సమస్య వరకు ఆయన కథావస్తువు విస్తరిస్తుంది.

రెండవ భేదం కథన విధానంలో కనిపిస్తుంది. జి.వి. సుబ్రహ్మణ్యం గారి కథనం సరళంగా, ఆత్మీయ సంభాషణలా సాగుతుంది. రచయితకు పాత్రలతో ఉన్న అనుబంధం పాఠకుడికి స్పష్టంగా తెలుస్తుంది. కథ పూర్తయ్యాక ఒక మధురమైన జ్ఞాపకం మనలో మిగులుతుంది.

పతంజలి శాస్త్రి గారి కథనం మాత్రం బహుళ అర్థాలతో కూడుకొని ఉంటుంది. ఆయన కథలో పైకి కనిపించే కథ ఒకటైతే, దాని వెనుక సూచించే కథ మరొకటి. గతం?వర్తమానం, వాస్తవం-ఊహ ఒక్కోసారి కలిసిపోతాయి. కథను పూర్తిగా వివరించకుండా, దాని అంతరార్థాన్ని తెలుసుకునే బాధ్యతను పాఠకుడికే అప్పగిస్తారు. అందుకే ఆయన కథ కాగితంపై ముగిసినా పాఠకుడి మనస్సులో మళ్లీ ప్రారంభమవుతుంది. కూడా ఈ లక్షణాన్ని ప్రత్యేకంగా విమర్శకల్ లోకం పేర్కొంటుంది.మూడవ భేదం రచయితల దృక్పథంలో ఉంది. 'సుశీల కథలు'లో రచయిత దృష్టి అనురాగపూర్వకమైనది. మనిషిలోని మంచితనాన్ని, కుటుంబ వ్యవస్థలోని ఆత్మీయతను కాపాడుకోవాలనే భావం అందులో ప్రధానంగా కనిపిస్తుంది. పతంజలి శాస్త్రి దృష్టిలో కరుణతోపాటు ధర్మాగ్రహం కూడా ఉంటుంది. సమాజంలోని అన్యా న్ని, ప్రకృతి విధ్వంసాన్ని ఆయన నిశ్శబ్దంగా గమనించినా, కథలోని వ్యంగ్యం ద్వారా తీవ్రంగా నిరసిస్తారు.క్రింది ఉదాహరణలు పరికిస్తే ఇద్దరి కథల మధ్య సాదృశ్యం మరింత స్పష్టమ వుతుంది:

**ఉదాహరణ 1:** సాధారణ జీవితంలో కథను గుర్తించడం

జి.వి. సుబ్రహ్మణ్యం గారి 'సుశీల కథలు'లో భార్యాభర్తల మధ్య జరిగే చిన్నచిన్న సంభాషణలు, అలకలు, అపార్థాలు, పరస్పర శ్రద్ధ కథలుగా రూపుదిద్దుకుంటాయి. సాధారణంగా కనిపించే గృహజీవితంలో దాగిన ప్రేమను రచయిత సున్నితమైన హాస్యంతో చూపిస్తారు.

అదేవిధంగా పతంజలి శాస్త్రి గారి 'రుబ్బురోలు' కథలోనూ ఇల్లు, అద్దె, కాఫీ, భార్యాభర్తల మాటలు వంటి నిత్యజీవిత విషయాలే కథకు ఆధారం. పైకి అవి సరదా సంభాషణలుగా కనిపించినప్పటికీ, వాటి వెనుక మధ్యతరగతి మనిషి ఆర్థిక అభద్రత, నివాస సమస్య, మానసిక ఒత్తిడి కనిపిస్తాయి.

అందువల్ల ఇద్దరూ సాధారణ కుటుంబ జీవితాన్నే కథావస్తువుగా స్వీకరించారు. అయితే జి.వి.ఎస్. దానిలోని ఆప్యాయతను ప్రధానంగా చూపిస్తే, పతంజలి శాస్త్రి అదే జీవితంలోని ఒత్తిడినీ, సామాజిక విషాదాన్నీ వ్యంగ్యంగా సూచిస్తారు.

**ఉదాహరణ 2:** మానవ సంబంధాలలోని ప్రేమ, కరుణ



తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి

'సుశీల కథలు'లో సుశీల కేవలం ఒక వ్యక్తిగత పాత్రగా మిగిలిపోదు. కుటుంబాన్ని ప్రేమతో నడిపించే భార్యగా, కష్టసుఖాల్లో భర్తకు తోడుగా నిలిచే సహచరిగా కనిపిస్తుంది. భార్యాభర్తల మధ్య ఉండే పరస్పర ఆధారితత్వం, ఒకరి మనస్సును మరొకరు అర్థం చేసుకోవడం ఈ కథలలో ప్రధానంగా వ్యక్తమవుతాయి.

పతంజలి శాస్త్రి గారి 'శైత్యాంశం' కథలో నిర్మల అనే విద్యావంతురాలు ఎన్నో పుస్తకాలు చదివినా తనలోని అశాంతిని తొలగించుకోలేకపోతుంది. చివరకు గొప్ప తాత్త్విక పరిజ్ఞానం లేని ఒక సాధారణ గ్రామీణ వ్యక్తి సాన్నిధ్యంలో ఆమెకు సాంత్వన లభిస్తుంది. ఇక్కడ కూడా మనిషికి నిజమైన ఊరట పుస్తకాల వల్ల మాత్రమే కాకుండా మరొక మనిషి అందించే ఆత్మీయత వల్ల కలుగుతుందని రచయిత సూచిస్తారు.

ఈ విధంగా 'సుశీల కథలు'లో దాంపత్యానుబంధం ద్వారా, 'శైత్యాంశం'లో మానవీయ సాన్నిహిత్యం ద్వారా?మనిషికి ప్రేమ, సహచర్యం, పరస్పర అవగాహన అవసరమనే ఒకే సత్యాన్ని ఇద్దరు రచయితలూ ప్రకటించారు.

మొత్తంగా చెప్పాలంటే, జి.వి. సుబ్రహ్మణ్యం గారి 'సుశీల కథలు' ఇంటి ముంగిట వెలిగే ఆప్యాయతా దీపాలవంటివి. తల్లాజ్ఝల పతంజలి శాస్త్రి కథలు సమాజంలోని చీకటి మూలలపై ప్రసరించే శోధన దీపాలవంటివి. ఒకరు కుటుంబ జీవితంలోని మాధుర్యాన్ని సున్నితంగా ఆవిష్కరిస్తే, మరొకరు వ్యక్తి, సమాజం, ప్రకృతి మధ్య ఉన్న సంక్లిష్ట సంబంధాలను బహుళ స్థాయిల్లో విశ్లేషిస్తారు.

అయితే ఇద్దరి అంతిమ లక్ష్యం ఒక్కటే-మనిషిని అర్థం చేసుకోవడం, మానవత్వాన్ని మేల్కొలపడం. అందుకే వారి కథలు భిన్న మార్గాల్లో ప్రయాణించినా తెలుగు కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన విలువైన రచనలుగా నిలిచాయి.

*( ఈనెల 10 వ తేదీ కీర్తిశేషులు ప్రముఖ విమర్శకులు,సాహితీ వేత్త డాక్టర్ జి.వి. సుబ్రహ్మణ్యం గారి పేరిట కథాసాహిత్య పురస్కారం ప్రముఖ కథకులు శ్రీ తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి గారికి ప్రదానం చేసిన సందర్భంగా అభినందన వ్యాసం )*



**-సుధామ**
సెల్:9849297958

# అధ్యయనమే ఉత్తమ కవిత్వ సృష్టికి మూలం

-డా॥ఎన్.గోపి



'ప్రబోధ' చంద్రోదయం' పుస్తకావిష్కరణలో బైస దేవదాసు, బిక్కి కృష్ణ, డా॥ఎన్.గోపి, యలవర్తి ధనలక్ష్మి, వి.డి.రాజగోపాల్, డా॥కోగంటి ఉషారాణి, డా॥రాధాకుసుమ.

హైదరాబాద్, సెప్టెంబర్ 156(నేటినిజం ప్రతినిధి): ఉత్తమ కవిత్వం సృష్టించాలంటే యువకవులు సాహిత్యాన్ని బాగా అధ్యయనం చేయాలని తెలుగు యూనివర్సిటీ పూర్వ వైస్ ఛాన్సలర్, ప్రముఖ కవి డా॥ఎన్.గోపి పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రముఖ కవి డా॥బిక్కి కృష్ణ అధ్యక్షతన "కవిత్వం-కార్యశాల" శిక్షణా శిబిరం జరిగింది. విశ్వ పుత్రిక గజల్ ఫౌండేషన్, కవితా వికాసవేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్.గోపి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కవయిత్రి యలవర్తి ధనలక్ష్మి రాసిన ప్రబోధ చంద్రోదయం పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. కవయిత్రి కృషిని ఆయన అభినందించారు. వివిధ దేశాల కవుల కవిత్వా గురించి.. కవుల గొప్పదనం గురించి ఎన్.గోపి వివరించారు.

ప్రతి వ్యక్తిది కవిత్వ హృదయమేనని సెల్లు వచ్చిన తర్వాత తమ హృదయ స్పందనలను ఎప్పటికప్పుడు సెల్లుద్వారా తెలుపుతున్నారని మంచి కవిత్వాన్ని ఆస్వాదిస్తున్నామని అయితే సెల్లుకు బానిస కాకూడదని మన విలువైన సమయం వృథా కాకుండా చూసుకోవాలని ప్రత్యేక అతిథి నేటినిజం సంపాదకులు బైస దేవదాసు అన్నారు. మనం రాస్తున్నదే గొప్ప కవిత్వంగా భావించరాదని ఇతరుల కవిత్వాన్ని చదివినప్పుడు అది తెలుస్తుందని, గొప్పవాళ్ళ పుస్తకాలు చదువకుండా, అధ్యయనం లేకుండా కవిత్వం రాయడం సాధ్యం కాదని అన్నారు. కొత్తగా రాస్తున్న వాళ్ళు ఇది గమనించాలని, ఈ రోజు నిర్వహిస్తు ఈ 'కవిత్వం-కార్యశాల' శిక్షణ శిబిరం ఎంతో దోహదపడుతుందని అన్నారు. ఈ శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్న బిక్కి కృష్ణను, మాణిక్యాలరావును అభినందించారు.

ఈ కార్యక్రమంలో కవితా వికాస వేదిక అధ్యక్షులు గట్టి మాణిక్యాలరావు, కవులు వి.డి. రాజగోపాల్, డా॥కోగంటి ఉషారాణి, మారేళ్ళ రాజరాజేశ్వరి, మంత్రిప్రగడ మార్కండేయులు, గజల్ గాయకులు ఆదిత్యరాం తదితరులు పాల్గొన్నారు.

యలవర్తి ధనలక్ష్మి ఎంతో కష్టపడి. మానవాళికి ఉపయోగపడే విధంగా "ప్రబోధ చంద్రోదయం" పుస్తకాన్ని రాశారని వక్తలు కొనియాడారు.

కవితా నిర్మాణ పద్ధతులు, గజళ్ళ రచనా సంవిధానంపై బిక్కి కృష్ణ శిక్షణనిచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎనభైమంది కవులు ఈ "కవిత్వం-కార్యశాల"లో పాల్గొన్నారు.

డా॥రాధా కుసుమ నిర్వహణలో జరిగిన కవి సమ్మేళనంలో పలువురు కవులు కవితాగానం చేశారు.

# ఆకెళ్ళ వెంకట సుబ్బలక్ష్మికి 'రంగినేని బాల సాహిత్య పురస్కారం'



ప్రౌఢ సాహితీవేత్తగా తెలుగు సాహిత్యంలో అడుగిడి, అందమైన కథలు, కవితలు, రాస్తూ ...భావి సాహిత్యానికి మూలాధారం బాలసాహిత్యమే అని నమ్మిన ఆకెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి తెలుగు బాల సాహితీవేత్తగా కృషి ప్రారంభించి, బహుముఖ ప్రతిభతో కథలు, గేయాలు, గేయ కథలు, రాస్తూ తెలుగు బాల సాహిత్యాన్ని సుసంపన్నం చేయడమే గాక, ఆరంగంలో కృషి చేస్తున్న వారికి తనదైన ప్రోత్సహం అందించాలనే సదుద్దేశంతో 2012 సం: నుంచి "బాలగోకులం", ప్రౌఢ సాహిత్యం కోసం "ఆకెళ్ళ సాహిత్య పురస్కారం" ఏర్పాటు చేసి కొనసాగిస్తూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు, ఈ బహుముఖ సాహితీ మణి కృషికి గాను ఇటీవల సిరిసిల్లకు చెందిన రంగినేని చారిటబుల్ ట్రస్ట్ "రేగులపాటి (రంగినేని) బాలసాహితీ పురస్కారం"తో గౌరవించారు, ఆ సందర్భంగా ఆకెళ్ళ సుబ్బలక్ష్మి గారి అంకితభావపు కృషిలోని ఆదర్శనీయ విషయాలు తెలుసుకుందాము. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా బాధ్యతల నిర్వహణలో భాగంగా భాగ్యనగరం చేరిన సుబ్బలక్ష్మి గారు అక్కడే ఉద్యోగ విశ్రాంతి పొంది హైదరాబాదు నివాసి అయిన ఆమె, 23 మార్చి 1952 న పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో మలపాక మహాలక్ష్మి సూర్యకాంతం, వెంకట నృసింహ రాఘవేంద్రరావు, పుణ్య దంపతులకు పుత్రికగా పుట్టారు. పసితనంలోనే పొరుగింట్లో బొమ్మల కథల పుస్తకాలతో పరిచయం చేసుకున్న తను తరువాత తండ్రిగారి ప్రోత్సాహంతో కనిపించిన పుస్తకాన్ని వదలకుండా చదువుతూ తాను కూడా వ్రాయాలనే తలంపుతో రచనలు చేయడం ప్రారం భించారు, వీరు రాసిన తొలి కథ "పాపం సంధ్య" 1980 నాటి "విజయ" మాస పత్రికలో ప్రచురించబడింది, అనంతరం తన రచనా వ్యాసాంగం నడక ఉద్యోగ, సంసార, చదరంగాల సాక్షిగా వడి తగ్గిన, భర్త ఆకెళ్ళ వెంకట సుబ్బారావు గారి ఆదరణతో తనదైన సాహిత్య వ్యవసాయం కొనసాగించారు, సాహితీ గురువులైన పోతుకూచి సాంబశివరావు, రెడ్డి రాఘవయ్య, గార్ల ప్రోత్సాహంతో ప్రౌఢ- బాలసాహిత్యాల్లో విస్తృతమైన కృషి చేశారు, సుబ్బలక్ష్మి ప్రౌఢ సాహితీవేత్తగా రచనాంగేట్రం చేసినా.. బాల సాహితీవేత్తగానే ప్రాచుర్యం పొందారు, వీరు రాసిన తొలి పిల్లల కథ "సుందరయ్య తీర్థయాత్ర" 1997 మార్చి బొమ్మరిల్లు మాస పత్రికలో ప్రచురించబడింది మొదలు నేటి వరకు వందలాది బాలల కథలు వ్రాసారు, వీటిలో మేలైన కథలను బాల మందారం, బాలకుటీరం, బాలానందనం, బృందా వనం, అమ్మ మాట తేనెమూట, మాబాల కథలు, చిరు మొలకలు, అనే పేర్లతో బాలల కథా సంపుటాలు ప్రచురించారు, సంభాష ణలుగా సాగే సుబ్బలక్ష్మి గారి బాలల కథలు పిల్లల మనసులకు దగ్గరగా ఉండే సమకాలీన అంశాలనే కథా వస్తువులుగా చేసుకుని సాగుతాయి, పిల్లలకు పసితనం నుంచే మానవ సంబంధాలు, కుటుంబ అనుబం ధాలు, తెలియజేయాలనే తపన వీరి కథల్లో అడుగడుగునా కనిపిస్తుంది, అలాగే సమయ స్ఫూర్తి, నీతి, సందేశాలతో పాటు, చిరు హాస్య సువాసనలు ఆకెళ్ళ సుబ్బలక్ష్మి గారి కథాసుమాలకు సుమధుర పరిమళాలుగా బాసిల్లుతాయి, బాల్యానికి దేశభక్తితో పాటు ఆధ్యాత్మిక శక్తి అవసరం, అని నమ్మిన ఆకెళ్ళ "బాలల సంక్షిప్త హనుమ చరిత్ర" ను సులభశైలిలో సరళ భాషణలతో సచిత్రంగా అందించారు, ప్రౌఢ సాహితీ విభాగంలో వీరి కృషి కథా మందారం, అమ్మ నువ్వు మారావు, గుప్పిటలో గోదావరి, అక్షింతలు, కథా సంపుటాలు. కవితా మందారం, సాహితీ సోరణం కవితా సంపుటా లుగా నిక్షిప్తం అయింది, వీరి బాలల రచనలు కన్నడ, తమిళ ,రష్యన్ ఆంగ్లం, జానపద కథలుగా అనువాదం పొందటమే కాక ఈమె వ్రాసిన "అసలు లోపం" "విలువైనవి" అనే బాలల కథలు మహారాష్ట్ర ప్రభుత్వం తెలుగు పాఠ్యపుస్తకాల కమిటీ వారి ద్వారా ఎంపికై తొమ్మిది, ఏడు, తరగతులకు పాఠ్యాంశాలుగా ప్రస్తుతం కొనసాగుతున్నాయి, సుబ్బలక్ష్మి గారి సుదీర్ఘ సాహితీ కృషికి గాను తెలుగు విశ్వవి ద్యాల యం బాలసాహితీ కీర్తి పురస్కారం, అదే విశ్వవిద్యాలయపు మాతృ వందన పురస్కారం,తోపాటు తెలంగాణ సారస్వత పరిషత్ వారి బాల సాహితీ సేవా పురస్కారం, గిడుగు రామ్మూర్తి, వేదగిరి రాంబాబు, నారంశెట్టి, పుట్టగుంట, మాచిరాజు, బాల సాహితీ పురస్కారాలు వరించాయి, 'తొణకని నిండుకుండ' వంటి ఈ సాహితీ సౌజన్యమూర్తి విశేష సాహితీ కృషికి గాను సిరిసిల్ల, రేగులపాటి (రంగినేని) బాల సాహిత్యం సంస్థ నిర్వహణ విభాగ పురస్కారం పొందడం తెలుగు బాలసాహి త్యానికి గర్వ కారణం, ఈ స్ఫూర్తితో వీరి కృషి మరింతగా ఎదగాలని ఆశిద్దాం.

(సెప్టెంబర్ 12న, రంగినేని బాల సాహితి పురస్కారం పొందిన సందర్భంగా.).

**-డా॥ అమ్మిన శ్రీనివాసరాజు**
సెల్:77298 83223

# 17వ జాతీయస్థాయి 'సోమేపల్లి' పురస్కారాలకు చిన్న కథలకు ఆహ్వానం

జాతీయస్థాయిలో గత పదహారేళ్ళుగా తెలుగు చిన్న కథల పోటీలు నిర్వహిస్తూ తెలుగు సాహిత్యరంగంలో విశిష్ట అవార్డులుగా ప్రఖ్యాతిని చాటుకుంటున్న సోమేపల్లి సాహితీ పురస్కారాలు ఈ ఏడూ ఇవ్వాలని సోమేపల్లివారి కుటుంబం నిర్ణయించింది. కథారచనను పరిపుష్టం చేసే ఉత్తమ కథలు వెలుగుచూడాలని, తద్వారా రచయితలను ప్రోత్సహించాలని, తెలుగు కథ గొప్పదనాన్ని దశదిశలా చాటాలనే లక్ష్యంతో... నిర్వహిస్తున్న ఈ పోటీలను ఎప్పటిలాగే విజయవంతం చేయాల్సిందిగా అందర్నీ కోరుతున్నాము... బహుమతులు వివరాలు-అత్యుత్తమ కథకు రూ. 2500/-, ఉత్తమ కథకు రూ.1500/-, మంచి కథకు రూ.1000/-, ప్రత్యేక బహుమతులు రూ.500/- చొప్పున ఇద్దరికి... ఈ పురస్కారం కొరకు పంపే కథల నిడివి రాతప్రతిలో రెండు నుంచి 4 పేజీలలోపు, డి.టి.పిలోనైతే 2 పుటలు కాగితం ఒక ప్రక్కనే రాయాలి. ఎటువంటి ఎంట్రీఫీజులేని ఈ పోటీలకు ఒకరు ఎన్ని కథలనైనా పంపవచ్చు. కథ పుటలపై రచయిత పేరుగానీ, ఆయా వివరాలు గానీ వుండకూడదు. కేవలం హామీపత్రంపై మాత్రమే రచయిత వివరాలు పేర్కొనాలి. కథలను అక్టోబర్ 30వ తేదీలోపు రమ్యభారతి, పి.బి.నెం:5, 11-57/1-32 జె.ఆర్.కాంప్లెక్స్, రెండవ అంతస్తు, రజక వీధి, విజయవాడ-520001 సెల్:9247475975 అనే చిరునామాకు పంపాలి.

# ప్రముఖ కవి, రచయిత 'సలీం'కు మహాకవి గురజాడ అవార్డు'

సహృదయ సాహితి 1992లో నెలకొల్పిన 'మహాకవి గురజాడ అవార్డు' ఈ సంవత్సరం 2026 నకు సుప్రసిద్ధ కథా, నవల రచయిత, కవి 'సయ్యద్ సలీం' గారికి ప్రదానం చేయడానికి అవార్డు కమిటీ నిర్ణయించింది. ఇంతవరకు ఈ అవార్డును ఆరుద్ర, రావి శాస్త్రి, కాళోజీ, శేషేంద్ర, దాశరథి రంగాచార్య, మాలతీచందూర్, ఆవంత్స సోమసుందర్, కాళీపట్నం రామారావు లకు ప్రదానం చేయడం జరిగింది.

2026 సంవత్సరానికి ఈ అవార్డును ప్రముఖ రచయిత 'సలీం' గారికి ఇవ్వడానికి నిర్ణయించిన సందర్భంగా మహాకవి గురజాడ జయంతి రోజున సెప్టంబరు 21 తేదీన అవార్డు గ్రహీతకు నగదు బహుమతి, జ్ఞాపిక, సత్కారం నగర ప్రముఖులు, సాహితీవేత్తల సమక్షంలో విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో జరిగే అవార్డు ప్రదానోత్సవ సభలో ప్రదానం చేయడం జరుగుతుందని శేఖరమంత్రి ప్రభాకర్, అధ్యక్షులు, సహృదయ సాహితి, విశాఖపట్నం తెలిపారు.

# నీ స్నేహ దీప్తి

దాతృత్వానికి-ద్వారంలా సంబర పరిచే-సద్గతి-నీ స్నేహ దీప్తి
దాపరికాలకు -దర్జీగా వుండ నివ్వని-సుగతి -నీ స్నేహ దీప్తి
దాఖలాలకు-దడవ నివ్వని-సుకీర్తి-నీ స్నేహ దీప్తి
దామోదరుడు కూడా-ఆశీస్సుల నందించేలా మసలే-సద్గతి-నీ స్నేహ దీప్తి.
దాశరథిలా కొలిచేలా అలరించే-ధరిత్రి-నీ స్నేహ దీప్తి
దశార్చుడూ కూడా-ఓహో-అనుకునేలా చేసే-అదితి-నీ స్నేహ దీప్తి
దర్జాగా-భరోసా నందిస్తూ-బాధకర పన్ను చేయ నివ్వని భవంతి నీ స్నేహ దీప్తి
దినకరునిలా-దీక్ష-దక్షతలతో-మసలేలా చేసే-మహోన్నతి నీ స్నేహ దీప్తి.
దార్మియామును చేకూర్చే-సమున్నతి-నీ స్నేహ దీప్తి
దాల్చిన చెక్కలా-కొనియాడేలా చేసే-పత్యాకృతి-నీ స్నేహ దీప్తి
దారంలా సాయమందిస్తూ-దగా చేయ నివ్వని-సుమతి నీ స్నేహ దీప్తి
దాళువా పంటలా-ప్రమోదాన్ని-ప్రసాదించే-సుకీర్తి-నీ స్నేహ దీప్తి.
దంతెన లా - అలరించే - ప్రగతి - నీ స్నేహ దీప్తి
దంతియ లా - నిలిచే - జ్యోతి - నీ స్నేహ దీప్తి
దా-దా-అంటూనే-దండయాత్ర చేయ నివ్వని-కాంతి నీ స్నేహ దీప్తి
ధన్యమైన-జీనియస్ లా-జీవితాన్ని గడిపేలా-సదా గంగా ప్రవాహ
పారవశ్య-స్నేహ రేఖల-ఆసరాగా నిలిచే-ప్రీతి నీ స్నేహ దీప్తి.



**-లంకా వెంకట సుబ్రహ్మణ్యం**
94404 48650.







ఆహ్వానం

శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయం సౌజన్యంతో
ఎం.వి.ఆర్ ఫౌండేషన్ నిర్వహణలో
రచన సాహిత్య వేదిక, కడప మరియు
గడియారం వారి కుటుంబీకుల సంయుక్త ఆధ్వర్యంలో
'మహాకవి' డా॥ గడియారం వేంకట శేషశాస్త్రి
45వ సాహిత్య పురస్కార ప్రదాన సభ



డా॥ గడియారం వేంకట శేషశాస్త్రి

పురస్కార స్వీకర్త
ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ గారు

తేది:20.09.2026, ఆదివారం
సమయం:సాయంత్రం 05-30 గంటలకు
వేదిక:శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయం
సుల్తాన్ బజార్, కోఠి, హైదరాబాద్

ముత్తిగుంట వెంకటరమణ
ఎం.వి.ఆర్. ఫౌండేషన్
సెల్: 8374822255

డా॥ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి
కార్యదర్శి, రచన సాహిత్య వేదిక
సెల్: 9966624276

స్వాగతం:
శ్రీ గడియారం వేంకట శేషశర్మ
ఉపాధ్యక్షులు, రచన సాహిత్య వేదిక, ప్రొద్దుటూరు

సభాధ్యక్షులు:
శ్రీ విహారి, రచన సాహిత్య వేదిక, అధ్యక్షులు

ప్రత్యేకాహ్వానితులు : రచన సాహిత్య వేదిక గౌరవ సలహామండలి సభ్యులు
డా॥ రేవూరు అనంత పద్మనాభరావు గారు
పూర్వ అదనపు డైరెక్టర్ జనరల్, దూరదర్శన్, ఢిల్లీ
శ్రీ గుత్తికొండ సుబ్బారావు గారు
అధ్యక్షులు, ప్రపంచ తెలుగు రచయితల సంఘం, మచిలీపట్నం

పురస్కార స్వీకర్త :
'సారస్వత భాస్కర' ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ గారు
విశ్వ విఖ్యాత శాస్త్రవేత్త, విద్వత్కవి, 'పంచవటి' కావ్యకర్త

విశిష్ట అతిథులు:
ఆచార్య అనుమాండ్ల భూమయ్య గారు
పూర్వ ఉపకులపతి, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్
డా॥ విల్హూరి మురళీధరరావు గారు
సుప్రసిద్ధ విమర్శకులు, బహుభాషా విద్వాంసులు, 'విద్యారత్న', ఢిల్లీ
శ్రీ సుధామ గారు
సుప్రసిద్ధ జాతీయ కవి, సాహితీవేత్త, 'సప్తపది' సృజనకర్త, హైదరాబాద్
శ్రీమతి ధూళిపాళ అరుణ గారు
సుప్రసిద్ధ సాహితీ విదుషీమణి, హైదరాబాద్

ప్రశంసాపత్ర ప్రదానం : శ్రీ యం. జానకిరామ్, ఉపాధ్యక్షులు

డా॥ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి,కార్యదర్శి శ్రీ అన్నవరం రామకుమార్, కార్యవర్గసభ్యులు

కార్యక్రమ సమన్వయం :
రచన సాహిత్య వేదిక కార్యవర్గ సభ్యులు : ఎన్. సుధీర్‌రెడ్డి, ఎన్.సురేష్ కుమార్, యస్.ఆర్.ప్రతాపరెడ్డి, డా॥ మూలె రామమునిరెడ్డి, యం. రమేష్, ముడియం కిషోర్ కుమార్.


Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.